

స్వామివారి కల్యాణానికి హాజరైన భక్తులు

కనుల పండువగా వేణుగోపాలుడి కల్యాణం

» హాజరైన ఎమ్మెల్యే శంకర్, మాజీ ఎమ్మెల్యే ప్రతాప్‌రెడ్డి

షాద్‌నగర్‌రూరల్, జనవరి20(ఆంధ్రజ్యోతి): ఫరూఖ్‌నగర్ మండలం దేవునిపల్లి గ్రామంలోని రుక్మిణీ సత్యభామ సమేత వేణుగోపాల స్వామి ఆలయ బ్రహ్మోత్సవాలు వైభవంగా కొనసాగుతున్నాయి. రెండో రోజు సోమవారం స్వామివారి కల్యాణం కనుల పండువగా నిర్వహించారు. వేద పండితుల మంత్రోచ్ఛారణల మధ్య జరిగిన ఈ వేడుకకు ఎమ్మెల్యే, ప్రభుత్వ రంగ సంస్థల చైర్మన్ వీర్లపల్లి శంకర్, మాజీ ఎమ్మెల్యే చౌలపల్లి ప్రతాప్‌రెడ్డి హాజరయ్యారు. మహిళలు పెద్ద సంఖ్యలో తరలివచ్చారు. స్వామివారికి మంగళ శాసనాలు, తీర్థ ప్రసాద వినియోగం, బలి హరణం నిర్వహించారు. అంతకు ముందు హోమాలు నిర్వహించారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్‌లు చేగూరి రాఘవేందర్ గౌడ్, రవిగౌడ్, బీజేపీ నాయకులు పాలమూరు విష్ణువర్ధన్‌రెడ్డి. రాజేందర్, లక్ష్మీనర్సింలు, శ్రీనివాస్, చేగూరి రవీందర్, బసప్ప, సుమన్ పాల్గొన్నారు.



విదేశీ అతిథులు వచ్చేశాయ్

కడ్తాల మండల పరిధిలోని ఉపరాసు చెరువు వద్ద విదేశీ విహంగాలు సందడి చేశాయి. సైబీరియా దేశం నుంచి వేల కిలోమీటర్ల దూరం ప్రయాణం చేసి వచ్చిన ఈ వింత పక్షులు చెరువు వద్ద ఆహారం కోసం అన్వేషించాయి. పక్షుల రూపు, రంగు, రెక్కలు, ముక్కు మిగతా పక్షుల కంటే భిన్నంగా ఉండటం చూసి స్థానికులు అబ్బురపోయారు. ఏటా ఈ పక్షులు ఫిబ్రవరిలో సైబీరియా నుంచి ఇతర ప్రాంతాలకు తరలివస్తుంటాయి.

- ఆంధ్రజ్యోతి ఫొటోగ్రాఫర్, రంగారెడ్డి జిల్లా

విద్యతోనే సమాజంలో మార్పు

గ్రంథాలయ వ్యవస్థ ఎంతో ప్రతిష్టాత్మకం

- అభివృద్ధి నిధుల నుంచి లైబ్రరీలకు 10 శాతం కేటాయించాలి
- విద్య, వైద్యానికి 80% నిధులు ఇవ్వాలి
- రాష్ట్ర పర్యాటక, ఎక్సైజ్ శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు
- షాద్‌నగర్ గ్రంథాలయ అభివృద్ధి కమిటీ పాలకవర్గ ప్రమాణ స్వీకారం



మాట్లాడుతున్న మంత్రి జూపల్లి కృష్ణారావు

షాద్‌నగర్, జనవరి 20 (ఆంధ్రజ్యోతి) సమాజంలో గ్రంథాలయ వ్యవస్థ ఎంతో ప్రతిష్ఠాత్మకమైందని, దానిని మరింత బలోపేతం చేయాల్సిన అవసరం ఉందని రాష్ట్ర పర్యాటక, ఎక్సైజ్ శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు అన్నారు. గ్రంథాలయాల అభివృద్ధి కోసం వాటి స్థాయిని బట్టి నియోజకవర్గ అభివృద్ధి ఫండ్ నుంచి 5నుంచి 10 శాతం నిధులు కేటాయించాలని సూచించారు. ఈ మేరకు సోమవారం షాద్‌నగర్ పట్టణంలోని గ్రంథాలయ అభివృద్ధి కమిటీ పాలకవర్గ ప్రమాణ స్వీకారానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా నూతన పాలకవర్గ కమిటీ చైర్మన్ మదన్‌మోహన్‌రెడ్డితో పాటు పాలకమండలి సభ్యుల చేత జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ మధూసూదన్‌రెడ్డి ప్రమాణస్వీకారం చేయించారు. అనంతరం మంత్రి జూపల్లి మాట్లాడుతూ విద్యతోనే సమాజంలో మార్పు వస్తుందన్నారు. కాని ప్రస్తుత సమాజంలో సంస్కృతి, సంప్రదాయాలు మంట కలిసి పోతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. సమాజంలో జరుగుతున్న అఘాయిత్యాలను చూస్తుంటే తన మనసు కలత చెందుతుందని తెలిపారు. విద్య లేకపోవడం, స్థాయికి మించి అప్పులు చేయడం వల్లనే దారుణాలకు ఒడికడుతున్నారని పేర్కొన్నారు. కోట్లు ఖర్చు పెట్టి మహనీయుల విగ్రహాలను ప్రతిష్ఠిస్తారు కానీ, వారి చేసిన త్యాగాలు, సేవలు, పోరాటాల గురించి సమాజానికి తెలియజేయడంలో పూర్తిగా విఫలమవుతున్నామన్నారు. గ్రంథాలయాల్లో మహనీయులకు సంబంధించిన పుస్తకాలను కూడా అందుబాటులో ఉంచాలన్నారు. షాద్‌నగర్ గ్రేడ్ వన్ అభివృద్ధి కోసం తమ శాఖ తరఫున రూ.5లక్షలు అందజేస్తామన్నారు.

సేవకు అంకితం కావాలి

పదవులు ముఖ్య కాదని, సేవా కార్యక్రమాల్లో చేపట్టినప్పుడే వాటికి సార్థకత చేకూరుతుందని ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ సూచించారు. విజ్ఞాన భాండాగారాలైన గ్రంథాలయాలను మరింత అభివృద్ధి పర్చేందుకు పాలకవర్గం కృషి చేయాలన్నారు. పోటీ పరీక్షలకు అవసరమైన పుస్తకాలను అందుబాటులో ఉంచాలన్నారు. ఎమ్మెల్సీ ప్రొఫెసర్ కోదండరాం మాట్లాడుతూ చరిత్రను సృష్టించాలన్న, మార్చాలన్న అది గ్రంథాలయాల నుంచే సాధ్యమవుతుందన్నారు. లైబ్రరీలలో కేవలం పుస్తకాలే కాకుండా వర్తమాన అంశాలపై విద్యార్థులకు అవగాహన కల్పించాలన్నారు. అలాగే రాజ్యాంగం ఏర్పడి 75సంవత్సరాలు అవుతున్నందున దానిపై విద్యార్థుల చేత వ్యాస రచన పోటీలను ఏర్పాటు చేయాలని సూచించారు. జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ మధుసూదన్ రెడ్డి మాట్లాడుతూ.. షాద్‌నగర్ గ్రంథాలయాన్ని డిజిటలైజేషన్ చేస్తామని హామీ ఇచ్చారు. అలాగే గ్రంథాలయ అభివృద్ధి కోసం పూర్తి సహాయ సహకారాలు అందిస్తామన్నారు. కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే ప్రతాప్‌రెడ్డి, ఏఎంసీ వైస్ చైర్మన్ బాబర్‌అలీఖాన్, పార్టీ నాయకులు అగ్గనూరు విశ్వం, చెంది తిరుపతి రెడ్డి, బాలరాజుగౌడ్, రఘునాయక్ తదితరులు పాల్గొన్నారు.

అర్హులను తేల్చేందుకు!



నేటి నుంచి గ్రామ, వార్డు సభలు

- ప్రదర్శించనున్న అర్హుల జాబితా
- ఈనెల 26 నుంచి నాలుగు పథకాల అమలుకు ఏర్పాట్లు
- క్షేత్రస్థాయిలో ముగిసిన లబ్ధిదారుల గుర్తింపు సర్వే

అసెంబ్లీ ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీ మేరకు నాలుగు పథకాలను అమలు చేసేందుకు రాష్ట్ర ప్రభుత్వం సిద్ధమవుతోంది. రైతు భరోసా, ఇందిరమ్మ ఆత్మీయ భరోసా, ఇందిరమ్మ ఇండ్లు, రేషన్ కార్డుల జారీ పథకాల కోసం అర్హులను గుర్తించేందుకు చేపట్టిన సర్వే కూడా పూర్తయ్యింది. నేటి నుంచి గ్రామ సభలు నిర్వహించి అర్హుల జాబితాను ప్రకటించేందుకు అధికారులు ఏర్పాట్లు చేశారు. ఈ జాబితాపై ఏమైనా అభ్యంతరాలు ఉంటే లిఖిత పూర్వకంగా తెలియజేసే అవకాశం కల్పించారు.



రంగారెడ్డి అర్బన్, జనవరి 20 (ఆంధ్రజ్యోతి) : రాష్ట్ర ప్రభుత్వం ఈనెల 26వ తేదీ నుంచి ప్రతిష్ఠాత్మకంగా నాలుగు పథకాలకు శ్రీకారం చుట్టనుంది. రైతు భరోసా, ఇందిరమ్మ ఆత్మీయ భరోసా, ఇందిరమ్మ ఇండ్లు, రేషన్ కార్డుల జారీ పథకాలను పకడ్బందీగా అమలు చేసేలా కలెక్టర్ సి.నారాయణరెడ్డి చర్యలు తీసుకుంటున్నారు. ఈనెల 16 నుంచి 20వ తేదీ వరకు ఆయా శాఖల బృందాలు క్షేత్ర స్థాయిలో సర్వే చేపట్టి అర్హులను గుర్తించారు. రైతు భరోసా అందజేతకు రెవెన్యూ, వ్యవసాయ అధికారులు క్షేత్రస్థాయిలో పర్యటించి సాగుకు యోగ్యమైన భూములను గుర్తించారు. ఇందిరమ్మ ఆత్మీయ భరోసా కోసం భూమి లేని వ్యవసాయ కూలీలను (ఉపాధిహామీ పనిలో 2023-24 సంవత్సరంలో జాబ్ కార్డులు ఉన్న వారిని) ఎంపిక చేశారు. అలాగే రేషన్ కార్డుల జాబితా రెడీ చేశారు. గుర్తించిన ఈ అర్హుల జాబితాను నేటి నుంచి (మంగళవారం) గ్రామ పంచాయతీల్లో ప్రకటించనున్నారు. ఎన్నో ఏళ్లుగా ఎదురు చూస్తున్న లబ్ధిదారులకు కొత్త రేషన్ కార్డులు అందనున్నాయి. ఇప్పటికే దరఖాస్తు చేసుకున్న వారి వివరాలను పరిశీలించి ఆమోదించారు. రేషన్ కార్డులో మార్పులు

మిగతా 8వ పేజీలో...

నియామకం

మాల మహానాడు యూత్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శిగా మహేష్ మాల

షాద్‌నగర్‌రూరల్, జనవరి 20 (ఆంధ్రజ్యోతి): మాల మహానాడు యూత్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శిగా చటాన్‌పల్లి గ్రామానికి చెందిన మహేష్ మాల నియామకమయ్యారు. చేవెళ్ల పట్టణంలోని ఓ గార్డెన్‌లో సోమవారం నిర్వహించిన మాల మహానాడు ముఖ్య కార్యకర్తల సమావేశంలో జాతీయ అధ్యక్షుడు జి. చెన్నయ్య నియామక పత్రం అందించారు. ఈ సందర్భంగా చెన్నయ్య మాట్లాడుతూ సంఘ సమస్యలపై అలుపెరుగని పోరాటం చేస్తున్న మహేష్‌ను యూత్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శిగా నియమించినట్లు తెలిపారు.



షాబాద్‌లో కార్గో సేవలను ప్రారంభిస్తున్న ఇషాక్ బిన్ మహమ్మద్

కార్గో సేవలను సద్వినియోగం చేసుకోవాలి

షాబాద్, జనవరి 20(ఆంధ్రజ్యోతి) : ఆర్టీసీ కార్గో సేవలను సద్వినియోగం చేసుకోవాలని మహబూబ్‌నగర్, రంగారెడ్డి, మెదక్ జిల్లాల అసిస్టెంట్ ట్రాఫిక్ మేనేజర్ ఇషాక్ బిన్ మహమ్మద్ అన్నారు. సోమవారం షాబాద్ ఆర్టీసీ బస్టాండ్‌లో ఆయన కార్గో సేవలను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... ఆర్టీసీ కార్గో ద్వారా వినియోగదారులకు డోర్ డెలివరీ సదుపాయం లభిస్తుందన్నారు. కార్యక్రమంలో షాద్‌నగర్ ఆర్టీసీ డిపో డీఎంఈ శ్రీనివాస్, షాబాద్ బస్టాండ్ మేనేజర్ వెంకటేష్, కార్గో నిర్వాహకుడు మల్లేష్, మోహన్‌రెడ్డి పాల్గొన్నారు.



స్థానిక పోరుకు సన్నద్ధం!

- గ్రామ పంచాయతీలు : 558
- పీఎస్‌లు : 3,501
- మొత్తం ఓటర్లు : 36,63,152
- పురుషులు : 18,84,092
- మహిళలు : 17,78,627
- ఇతరులు : 433
- ఎన్‌ఆర్‌ఐ ఓటర్లు : 361
- సర్వీసు ఓటర్లు : 615

త్వరలో ఎన్నికల నోటిఫికేషన్

- ఏర్పాట్లు చేస్తున్న అధికార యంత్రాంగం.. పల్లెలో రాజుకున్న రాజకీయం
- బరిలో నిలిచేందుకు సిద్ధమవుతున్న ఆశావహులు
- సంతానంపై నిబంధనల సడలింపుతో పెరిగిన పోటీ



యాచారం, జనవరి 20 (ఆంధ్రజ్యోతి) : పల్లెల్లో స్థానిక సంస్థల ఎన్నికల కోలాహలం మొదలైంది. గ్రామాల్లో రాజకీయ వేడి రాజుకుంది. ఆశావాహులు సర్పంచులుగా పోటీ చేసేందుకు సిద్ధమవుతున్నారు. మద్దతు కూడగట్టుకునేందుకు ప్రజల్లోకి వెళ్తూ అనేక సేవా కార్యక్రమాలు చేపడుతున్నారు. అలాగే ఎన్నికలు ఎప్పుడు వచ్చినా నిర్వహణకు అధికార యంత్రాంగం కూడా అన్ని ఏర్పాట్లు చేస్తుంది. పోలింగ్ కేంద్రాల ఎంపిక, ఎన్నికల గుర్తులు, ఓటరు తుది జాబితాను ప్రకటించింది. పోలింగ్ కేంద్రాల్లో మరుగుదొడ్లు, నీటి, విద్యుత్ సౌకర్యం ఉండేలా చర్యలు తీసుకున్నారు. సర్పంచులకు 30 గుర్తులు, వార్డు సభ్యులకు 20 గుర్తులను కేటాయిస్తూ ఎన్నికల సంఘం ఉత్తర్వులు జారీ చేసింది. గత జనవరి చివరి నాటికే పంచాయతీల్లో కొత్త పాలకవర్గాలు కొలువు తీరాల్సి ఉంది. లోక్‌సభ ఎన్నికల కారణంగా

మిగతా 8వ పేజీలో...

రిజర్వేషన్లపై వీడని ఉత్కంఠ

సర్పంచ్, ఎంపీటీసీ, జెడ్పీటీసీల రిజర్వేషన్లపై తీవ్ర ఉత్కంఠ నెలకొంది. గతంలో ఉన్న రిజర్వేషన్ల ప్రకారంగా ఎన్నికలు జరుపుతారా, లేదా కొత్తవి ప్రకటిస్తారా అనే విషయమై సందిగ్ధం నెలకొంది. గ్రామాలలో ఈ విషయంపై జోరుగా చర్చ సాగుతోంది.

పరిహారం తేల్చాలి

» రాచులూరు సమావేశంలో రైతుల డిమాండ్



మాట్లాడుతున్న గోపాల్

కందుకూరు, జనవరి 20 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వం మండలంలోని మీర్కాన్‌పేట రెవెన్యూలో ఏర్పాటు చేయనున్న ఫోర్త్‌సిటీ, ఫ్యూచర్‌సిటీ రోడ్డుకు భూములు కోల్పోతున్న వారి బాధలను గుర్తించి తగిన పరిహారం ఇప్పించాలని రైతులు కోరారు. సోమవారం కలెక్టర్ నారాయణరెడ్డి ఆదేశాల మేరకు మండల పరిధి రాచులూరు గ్రామంలోని ఫంక్షన్‌హాల్‌లో రాచులూరు, తిమ్మాపురం, గాజులబుర్జు తండాకు చెందిన రైతులతో భూసేకరణ డిప్యూటీ కలెక్టర్ రాజు, తహసీల్దార్ కె.గోపాల్ సమావేశమయ్యారు. భూములిచ్చే రైతులకు ప్రభుత్వ మార్కెట్ ప్రకారం పరిహారం ఇవ్వనున్నట్లు అధికారులు తెలిపారు. దీంతో రైతుల తరఫున సీపీఎం మండల కార్యదర్శి బుట్టి బాల్‌రాజ్ మాట్లాడుతూ బహిరంగ మార్కెట్‌లో భూములకు ఎక్కువ ధర ఉందని, దాని ప్రకారం పరిహారం చెల్లించాలని కోరారు. ఈ ప్రాంతంలో భూసేకరణ చేపడుతుండటంతో రాచులూరు గ్రామానికి చెందిన ఎం.రాజు ఇటీవల గుండెపోటుతో మృతి చెందాడని, ఆ కుటుంబానికి ప్రభుత్వం వెంటనే రూ.5లక్షల ఎక్స్‌గ్రేషియా చెల్లించాలని డిమాండ్ చేశారు. దీంతో అధికారులు ఎలాంటి సమాచారం ఇవ్వకుండా సమావేశం మధ్యలోనే వెనుదిగారు. ఈ కార్యక్రమంలో ఆర్ఐ యాదగిరి, 120మంది రైతులు పాల్గొన్నారు.

గణతంత్ర వేడుకలను ఘనంగా నిర్వహించాలి

» కలెక్టర్ నారాయణరెడ్డి



ప్రజావాణిలో విజ్ఞప్తులను స్వీకరిస్తున్న కలెక్టర్

రంగారెడ్డి అర్బన్, జనవరి 20 (ఆంధ్రజ్యోతి) : గణతంత్ర వేడుకలను పండగ వాతావరణంలో నిర్వహించుకోవాలని కలెక్టర్ నారాయణరెడ్డి సూచించారు. సోమవారం కలెక్టరేట్‌లో ప్రజావాణి కార్యక్రమ నిర్వహణ అనంతరం ఆయన మాట్లాడుతూ ఈనెల 26వ తేదీన నిర్వహించే గణతంత్ర వేడుకల్లో వివిధ శాఖలకు సంబంధించిన స్టాల్స్ శకటాలు ఏర్పాటు చేయాలన్నారు. విద్యార్థులచే సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించాలన్నారు. అధికారులందరూ సమన్వయంతో పని చేసి వేడుకలను విజయవంతమయ్యేలా చూడాలన్నారు. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ ప్రతిమా సింగ్, జిల్లా రెవెన్యూ అధికారి సంగీత, వివిధ శాఖల జిల్లా అధికారులు, మున్సిపల్ అధికారులు, మండల తహసీల్దారులు, కలెక్టరేట్ సూపరింటెండెంట్లు పాల్గొన్నారు.

ప్రజావాణికి 87 ఫిర్యాదులు

కలెక్టరేట్‌లో సోమవారం నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో మొత్తం 87 ఫిర్యాదులు వచ్చాయి. అందులో రెవెన్యూశాఖకు సంబంధించి 38, ప్రజాపాలన దరఖాస్తులు 10, హౌజింగ్ శాఖవి 9, వివిధ శాఖలకు సంబంధించి మరో 30 దరఖాస్తులు అందాయి. ప్రజల నుంచి వచ్చిన దరఖాస్తులను కలెక్టర్ పరిశీలించారు. త్వరగా పరిష్కరించాలని అధికారులను ఆదేశించారు.

టాస్క్ ద్వారా మహిళలకు ఉపాధి

» సీవోవో సుంకిరెడ్డి రాఘువేందర్ రెడ్డి



మాట్లాడుతున్న సుంకిరెడ్డి రాఘువేందర్ రెడ్డి

ఆమనగల్లు , జనవరి 20 (ఆంధ్రజ్యోతి): నిరుద్యోగ మహిళలకు ఉపాధి కల్పించేందుకు టాస్క్, ఐక్యత ఫౌండేషన్ ఆధ్వర్యంలో భారీ జాబ్‌మేళా నిర్వహిస్తున్నట్లు ఫౌండేషన్ చైర్మన్, టాస్క్ సీవోవో సుంకిరెడ్డి రాఘవేందర్ రెడ్డి తెలిపారు. 18 నుంచి 28 ఏళ్ల వయసు గల యువతులు ఉద్యోగాలకు అర్హులని ఆయన పేర్కొన్నారు. ఆమనగల్లు ఐక్యత ఫౌండేషన్ కార్యాలయంలో సోమవారం సుంకిరెడ్డి రాఘవేందర్‌రెడ్డి మాట్లాడుతూ జాబ్‌మేళా ద్వారా 3 వేల మంది వరకు ఉపాధి అవకాశాలు కల్పిస్తామని తెలిపారు. ఎస్సెస్సీ, ఇంటర్, డిగ్రీ పాస్ లేదా ఫెయిల్ అయిన వారు ఆమనగల్లు ఐక్యత ఫౌండేషన్ కార్యాలయంలో జిరాక్స్ సర్టిఫికెట్లతో దరఖాస్తులు చేసుకోవాలని సూచించారు. ఎంపికైన అభ్యర్థులకు కొంగరకలాన్ సమీపంలోని ఓ ఎలక్ట్రానిక్ కంపెనీలో అసెంబ్లీ హెల్పర్స్, వేర్‌హౌజ్ ఆపరేషన్స్ ఉద్యోగాలు (రెండు షిఫ్టులు) కల్పించడం జరుగుతుందని పేర్కొన్నారు. ఎంపికైన అభ్యర్థులకు రెండు పూటల భోజనం, ఉచిత రవాణా సౌకర్యంతో పాటు బీమా సదుపాయం ఉంటుందని వివరించారు. అదేవిధంగా ఏడాదికి రూ.1.80 లక్షల వేతనం అందించనున్నట్లు పేర్కొన్నారు. కొంగరకలాన్‌కు 50 కిలోమీటర్ల పరిధిలోని నిరుద్యోగ యువతులు జాబ్‌మేళాను సద్వినియోగం చేసుకోవాలన్నారు. జాబ్‌మేళా తేదీలను త్వరలో ప్రకటించడం జరుగుతుందని తెలిపారు.

గట్టు మైసమ్మ హుండీ ఆదాయం లెక్కింపు

ఘట్‌కేసర్, జనవరి 20 (ఆంధ్రజ్యోతి): ఘట్‌కేసర్ గట్టుమైసమ్మ జాతర హుండీలను సోమవారం దేవాలయంలోని కార్యాలయంలో లెక్కించారు. జాతర సందర్భంగా ఆదివారం ఏర్పాటు చేసిన హుండీల ద్వారా రూ.2లక్షలా 23వేలా 298 ఆదాయం సమకూరినట్లు అధికారులు తెలిపారు. వివిధ రకాల టికెట్ల ద్వారా వచ్చిన ఆదాయంతోపాటు, విరాళాలు లెక్కించాల్సి ఉందని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఈవో భాగ్యలక్ష్మి, చైర్‌పర్సన్ పావని, కౌన్సిలర్లు ఆంజనేయులు, నర్సింగరావు, మల్లేష్, వెంకట్‌రెడ్డి, నాయకులు రాధాకృష్ణ, బొక్క ప్రభాకర్‌రెడ్డి, బొక్క జంగారెడ్డి, దేవాదాయ శాఖ సిబ్బంది పాల్గొన్నారు.

అర్హులందరికీ రేషన్ కార్డులు


సర్వేను పరిశీలిస్తున్న ఆర్డీవో వాసుచంద్ర

కులకచర్ల, జనవరి 20 (ఆంధ్రజ్యోతి): అర్హులైన వారందరికీ రేషన్ కార్డులు మంజూరు చేస్తామని వికారాబాద్ ఆర్డీవో వాసుచంద్ర తెలిపారు. మండలంలోని ముజాహిద్‌పూర్‌లో జరుగుతున్న రేషన్‌కార్డుల సర్వేను సోమవారం ఆయన పరిశీలించారు. నేటి(మంగళవారం) నుంచి ఈనెల 24 వరకు నిర్వహించే గ్రామ సభల్లో వచ్చిన దరఖాస్తులను స్వీకరించడంతో పాటు ప్రజాపాలనలో వచ్చిన దరఖాస్తులను పరిశీలిస్తామని తెలిపారు. గ్రామ సభల్లో రేషన్ కార్డులో మార్పుల, చేర్పుల కోసం అవకాశం ఉందన్నారు. ఈ కార్యక్రమంలో మార్కెట్ కమిటీ చైర్మన్ బీఎస్ ఆంజనేయులు, తహసీల్దార్ మురళీధర్, పంచాయతీ కార్యదర్శి సతీశ్, స్థానికులు చంద్రభూపాల్, షర్ఫోద్దీన్, భాస్కర్ తదితరులు పాల్గొన్నారు.

ఉపాధ్యాయులు సమాజ మార్గదర్శకులు

కడ్తాల్ , జనవరి 20 (ఆంధ్రజ్యోతి): ఉపాధ్యాయులు సమాజానికి మార్గదర్శకులని డీసీసీ అధికార ప్రతినిధి గూడూరు శ్రీనివాస్ రెడ్డి, మాజీ జడ్పీటీసీ దశరథ్ నాయక్, రాష్ట్ర సర్పంచ్‌ల సంఘం మాజీ అధ్యక్షుడు గూడూరు లక్ష్మీనర్సింహారెడ్డి, బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎర్రోళ్ల రాఘవేందర్, ఎంఈవో సత్యనారాయణ అన్నారు. విద్యార్థులకు విలువలతో కూడిన విద్యను అందించి వారి భవిష్యత్తుకు ఉపాధ్యాయులు బాటలు వేయాలని కోరారు. టీఎస్‌యూటీఎఫ్ కడ్తాల మండల శాఖ ఆధ్వర్యంలో రూపొందించిన 2025 నూతన సంవత్సర క్యాలెండర్‌ను సోమవారం కడ్తాల బాలుర ఉన్నత పాఠశాలలో ఆవిష్కరించారు. యూటీఎఫ్ మండల అధ్యక్షుడు జంగయ్య ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమానికి ఆ సంఘం జిల్లా అధ్యక్షుడు గోపాల్ నాయక్ హాజరయ్యారు. కార్యక్రమంలో టీఎస్‌యూటీఎఫ్ నాయకులు మల్లయ్య, శంకర్‌నాయక్, విజయ్‌కుమార్, సత్యనారాయణ, భీముడు, కౌసల్య, భాగ్యలక్ష్మీ, పాండు, రాజు, రవి, కృష్ణ, శోభారాణి, బుచ్చమ్మ పాల్గొన్నారు.

ఎస్‌జీటీలకు ఓటు హక్కు కల్పించాలి


క్యాలెండర్‌ను ఆవిష్కరిస్తున్న నాయకులు

చేవెళ్ల జనవరి 20 (ఆంధ్రజ్యోతి): ఎస్‌జీటీ ఉపాధ్యాయులకు ఎమ్మెల్సీ ఎన్నికల్లో ఓటు హక్కు కల్పించాలని తెలంగాణ ప్రాంత ఉపాధ్యాయ సంఘం గౌరవ అధ్యక్షుడు గణపురం సురధీర్ తెలిపారు. సోమవారం చేవెళ్ల మండలంలోని ఆయా ప్రభుత్వ పాఠశాలల్లో యూనియన్ ఆధ్వర్యంలో నూతన సంవత్సర క్యాలెండర్, డైరీని ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారానికి టీపీయూఎస్ సంఘం నిరంతరం పని చేస్తుందన్నారు. ఎమ్మెల్సీ ఎన్నికల్లో ఎస్‌జీటీ ఉపాధ్యాయులకు అవకాశం కల్పించాలని డిమాండ్ చేశారు. పెండింగ్‌లో ఉన్న ఐదు డీఏలను విడుదల చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఎంఈవో పురందాస్, ప్రధానోపాధ్యాయులు శ్రీధర్, డివిజన్ అధ్యక్షుడు మోర లక్ష్మణ్, రాజశేఖర్‌రెడ్డి, మండల ప్రధాన కార్యదర్శి వెంకటేష్‌గౌడ్. రమణారెడ్డి, నాయకులు శంకర్, శ్రీకాంత్, అమ్మణరావు తదితరులు ఉన్నారు.

తోలుకట్టలో కబ్జాలపై స్పందించండి

కలెక్టర్‌ను కోరిన కాంగ్రెస్ నేత శివశంకర్ గౌడ్

మొయినాబాద్ రూరల్, జనవరి20(ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని తోలుకట్ట గ్రామంలో ప్రభుత్వ భూములు కబ్జాకు గురవు తున్నాయని, ఈ విషయం లో నియోజకవర్గస్థాయి రెవెన్యూ సిబ్బందికి పలుమార్లు ఫిర్యాదు చేసినా పట్టించుకోవడం లేదని, ఉన్నతాధికారులు స్పందించి చర్యలు తీసుకోవాలని కాంగ్రెస్ సీనియర్ నాయకుడు శివశంకర్ గౌడ్ కోరారు. ఈ మేరకు సోమవారం గ్రామస్తులతో కలెక్టరేట్‌లో కలెక్టర్ నారాయణ రెడ్డిని కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మట్లాడుతూ తోలుకట్ట గ్రామంలోని సర్వే నంబర్ 108, 107, 85, 139, 138, 137, 143 నంబర్‌లోని 126 ఎకరాలు ప్రభుత్వ భూమి ఉందని, దీనిపై కన్నేసిన నగరానికి చెందిన కొందరు వ్యక్తులు కబ్జా చేసేందుకు యత్నిస్తున్నారని పేర్కొన్నారు. ఈ విషయంపై ఫిర్యాదు చేసినందుకు సదరు కబ్జాకోరులు బెదిరిస్తున్నారని, కోర్టు నుంచి నోటీసులు కూడా పంపించి కేసులు నమోదు చేయించారని వాపోయారు. తమ లక్ష్యం గ్రామంలోని ప్రభుత్వ భూములను కాపాడడమేనన్నారు. కబ్జాదారులకు స్థానిక ప్రజాప్రతినిధులు సహకరిస్తున్నారని ఆరోపించారు. గ్రామస్తులు రవీందర్‌రెడ్డి, సురేందర్ రెడ్డి, చాకలి యాదయ్య, చాకలి విక్రం, కనక మామిడి నవీన్, భానురి రాజు, కావాలి మహేందర్ ఉన్నారు.

గవర్నర్‌ను కలిసిన పరిగి బీజేపీ నాయకులు


గవర్నర్ విష్ణుదేవ్‌వర్మతో బీజేపీ నాయకులు

పరిగి, జనవరి 20 (ఆంధ్రజ్యోతి): తెలంగాణ గవర్నర్ విష్ణుదేవ్‌వర్మను సోమవారం రాజ్‌భవన్‌లో బీజేపీ పరిగి పట్టణ ప్రధానకార్యదర్శి వార్ల ఆంజనేయులు కలిసి పుష్పగుచ్ఛం అందజేశారు. రాష్ట్ర రాజధానికి దగ్గరలో ఉన్న పరిగి అభివృద్ధికి నోచుకోవడంలేదని, ప్రభుత్వంతో నిధులు విడుదల చేయిచాలని విజ్ఞప్తి చేశారు. గవర్నర్‌ను కలిసివారిలో పీఎస్‌పీఎస్ అధ్యక్షుడు రాఘవేందర్‌గౌడ్‌లు ఉన్నారు.

కొడంగల్ అభివృద్ధికి సహకరించాలి


మాట్లాడుతున్న మున్సిపల్ చైర్మన్ జగదీశ్వర్‌రెడ్డి

కొడంగల్, జనవరి 20 (ఆంధ్రజ్యోతి): కొడంగల్ మున్సిపాలిటీ అభివృద్ధికి ప్రతీ ఒక్కరు సహకరించాలని మున్సిపల్ చైర్మన్ ఆర్. జగదీశ్వర్‌రెడ్డి అన్నారు. స్థానిక మున్సిపల్ కార్యాలయంలో సోమవారం పాలకమండలి సమావేశం నిర్వహించారు. మున్సిపల్ పాలక మండలి ఏర్పడి ఐదేళ్లు గడుస్తున్న నేపథ్యంలో చివరి సమావేశం నిర్వహించినట్లు తెలిపారు. పదవీ కాలం ఈనెల 26వ తేదీ వరకు ఉందని తెలిపారు. కొడంగల్ మున్సిపల్ అభివృద్ధికి ప్రభుత్వం రూ.437కోట్లు మంజూరు చేసిందని తెలిపారు. అందులో అంబేడ్కర్ చౌరస్తా విస్తరణ, అండర్ గ్రౌండ్ డ్రైనేజీ, రోడ్లు తదితర అభివృద్ధి పనులకు రూ.337 కోట్లు మంజూరైనట్లు తెలిపారు. అదేవిధంగా పాత కొడంగల్ ట్యాంకు బండ్ నిర్మాణానికి రూ.45కోట్లు, మినీ స్టేడియం నిర్మాణానికి రూ.3కోట్లు, ఇతర అభివృద్ధి పనులకు రూ.52కోట్ల మంజూరుకు అనుమతి వచ్చిందని తెలిపారు. ఉద్యోగుల సహకారంతోనే మున్సిపల్ అభివృద్ధి పనులు జరుగుతున్నాయని ఆయన తెలిపారు. ఈ సమావేశంలో మున్సిపల్ వైస్ చైర్‌పర్సన్ ఉషారాణి, కమిషనర్ బలరాంనాయక్, కౌన్సిలర్లు, కో ఆప్షన్ సభ్యులు, మున్సిపల్ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

బాలికపై వేధింపులు.. పోక్సో కేసు నమోదు

చౌదరిగూడ, జనవరి 20(ఆంధ్రజ్యోతి): ఎక్స్‌పీరియన్స్ సర్టిఫికెట్ ఇవ్వాలంటే తన కోరిక తీర్చాలని ఓ బాలికను లైంగికంగా వేధించిన ఓ వ్యక్తిపై పోక్సో చట్టం కింద కేసు నమోదైన సంఘటన రంగారెడ్డి జిల్లా జిల్లేడు చౌదరిగూడలో చోటుచేసుకుంది. ఎస్ఐ విజయ్ తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. హైదరాబాద్‌కు చెందిన ఓ బాలిక జిల్లేడ్ చౌదరిగూడ మండల కేంద్రంలోని శుభం డయాగ్నోస్టిక్ సెంటర్‌లో ల్యాబ్ టెక్నీషియన్‌గా పనిచేస్తూ స్థానికంగా అద్దె రూంలో ఉంటుంది. బాలికకు ఇంతకు మించి మెరుగైన అవకాశాలు వస్తుండటంతో డయాగ్నోస్టిక్ సెంటర్ ఓనర్ శ్రీకాంత్‌ను ఎక్స్‌పీరియన్స్ సర్టిఫికెట్ ఇవ్వాల్సిందిగా కోరింది. సర్టిఫికెట్ ఇవ్వాలంటే లైంగిక కోరికను తీర్చాలని శ్రీకాంత్ వేధించడం మొదలు పెట్టాడు. ఈ విషయంపై బాలిక తన కుటుంబ సభ్యులకు తెలిపి పోలీసులకు ఫిర్యాదు చేసింది. మైనర్ ఫిర్యాదు మేరకు పోక్సో చట్టం కింద కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ విజయ్ తెలిపారు.

కిలో టమాట ₹5

గిట్టుబాటు ధర లేక అన్నదాత దిగాలు


తోటలోనే మురిగిపోతున్న టమాటాలు

- తోటల్లోనే మురుగుతున్న పంట
- పెట్టుబడి డబ్బులు కూడా రాక ఇబ్బందులు


తోటల వద్ద కుప్పగా పోసిన టమాటాలు

షాద్‌నగర్ అర్బన్, జనవరి 20 (ఆంధ్రజ్యోతి): ఆరుగాలం కష్టపడి టమాట పంటను సాగుచేసిన రైతులకు చివరికి అప్పులే మిగిలాయి. ఎంతో ఆశతో పండించిన పంట చేతికొచ్చే సరికి రైతన్నకు గిట్టుబాటు ధర లేకపోవడంతో దిగాలు చెందతున్నాడు. మార్కెట్‌లో కిలో టమాట రూ.5కు మించి పలకకపోవడంతో రైతులు పంటను తోటల్లోనే వదిలేస్తున్నారు. మార్కెట్‌కు తెచ్చినా గిట్టుబాటు ధర లేకపోవడంతో వెనక్కి తీసుకువెళ్లి పశువులకు వేస్తున్నారు. పెట్టుబడి డబ్బులు కూడా వచ్చే అవకాశం లేకపోవడంతో తీవ్ర ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఆరుతడి పంటలకు అనువుగా ఉన్న షాద్‌నగర్ నియోజకవర్గంలోని భూముల్లో చాలా మంది రైతులు టమాట సాగుచేశారు. వర్షాలపై ఆధారపడి కొందరు.. బోర్ల కింద మరికొందరు సాగుచేశారు. వాతావరణం అనుకూలించడం, చాలా వరకు హైబ్రిడ్ రకం సాగుచేయడంతో టమాట ఉత్పత్తి భారీగా పెరిగింది. దాంతో షాద్‌నగర్, శంషాబాద్, హైదరాబాద్ మార్కెట్లకు తీసుకువెళ్లిన టమాటను కొనే దిక్కు కూడా లేదు. 25 కిలోల టమాట బాక్స్‌కు రూ.100 నుంచి రూ.120 వరకు ధర పలుకుతోంది. దాంతో కూలీలు, రవాణా ఖర్చులు కూడా రావడం లేదని రైతులు వాపోతున్నారు. కొందరు టమాటాలను తెంపకుండానే తోటల్లోనే వదిలేస్తున్నారు. నిల్వ చేసుకునే సౌకర్యంగానీ, ప్రత్యామ్నాయ ఉత్పత్తులు తయారు చేసే పరిశ్రమలుగానీ లేకపోవడంతో టమాటాలను తోటల్లోనే వదిలేసి, పశువులను మేపుతున్నారు.

ఉత్పత్తి పెరిగింది.. డిమాండ్ తగ్గింది



టమాట ఉత్పత్తి గణనీయంగా పెరిగింది.. డిమాండ్ తగ్గింది. షాద్‌నగర్ నుంచి ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లాతో పాటు రాష్ట్రంలోని పలు జిల్లాలకు ఎగుమతి చేసేవాళ్లం. ప్రస్తుతం అన్ని ప్రాంతాల్లో టమాట ఉత్పత్తి పెరిగి, ఎగుమతి నిలిచింది. టమాట ఆధారిత ఉత్పత్తుల తయారీ పరిశ్రమలు కూడా లేకపోవడంతో ధర పూర్తిగా పడిపోయింది.

- అగ్గనూరి వీరేశ్, కమీషన్ ఏజెంట్, షాద్‌నగర్

తోటలోనే వదిలేస్తున్నాం



మార్కెట్‌లో గిట్టుబాటు ధరలేక టమాటాలను తోటలోనే వదిలేస్తున్నాం. బోర్ల కింద రెండున్నర ఎకరాల్లో పంటను సాగుచేశాం. రెండు రోజులకు 250 బాక్సులు వస్తున్నాయి. సంక్రాంతి నుంచి మార్కెట్‌కు తీసుకువెళ్తుండగా.. 25 కిలోల బాక్సుకు రూ.100 పలుకుతోంది. కిలోకు కేవలం నాలుగైదు రూపాయలు వస్తున్నాయి. కూలీలు, రవాణా ఛార్జీలు కూడా రావడం లేదు.

- చిప్పలపల్లి లక్ష్మయ్య, రైతు, మధురాపురం

ప్రజలకు భరోసాగా కాంగ్రెస్


బ్రోచర్‌ను ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి

తలకొండపల్లి, జనవరి 20 (ఆంధ్రజ్యోతి): కాంగ్రెస్ అంటే ప్రజలకు భద్రత, భరోసా అని కల్వకుర్తి ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణ రెడ్డి అన్నారు. తలకొండపల్లి మండలంలో సోమవారం ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణ రెడ్డి పర్యటించారు. పలు అభివృద్ధి కార్యక్రమాల్లో పాల్గొన్నారు. ఖానాపూర్ గ్రామ పంచాయతీ కర్కస్ తండాకు చెందిన సభావట్ మన్నికి మంజూరైన రూ. 10 లక్షల పోస్టల్ బీమా చెక్కును అధికారులు, స్థానిక నాయకులతో కలిసి అందజేశారు. వెల్జాల గ్రామంలో ఫిబ్రవరి 7 నుంచి 9వ తేదీ వరకు నిర్వహించే శ్రీ వేదాద్రి లక్ష్మీనర్సింహ స్వామి బ్రహ్మోత్సవాల బ్రోచర్‌ను ఆలయ ధర్మకర్త శ్రీనివాస మూర్తితో కలిసి ఆవిష్కరించారు. అర్హులైన పేదలకు పక్కా ఇళ్లు, రేషన్ కార్డులు అందిస్తామన్నారు. ఖానాపూర్ గ్రామంలో రూ. 150 కోట్లతో ఇంటిగ్రేటెడ్ రెసిడెన్సియల్ స్కూల్ ఏర్పాటు చేయనున్నట్లు తెలిపారు. కల్వకుర్తి నియోజకవర్గంలో పంచాయతీరాజ్, ఆర్అండ్‌బీ శాఖల పరిధిలోని అన్ని బీటీ రోడ్లను ఆధునీకరిస్తామన్నారు. రోడ్ల నిర్మాణానికి రూ.500 కోట్లతో ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపగా రూ.295 కోట్లు మంజూరైనట్లు చెప్పారు. సీఎం రేవంత్ రెడ్డి చొరవతో కల్వకుర్తికి మహర్దశ ఏర్పాడిందన్నారు. రాష్ట్రంలో ప్రజారంజక పాలన చూసి ఓర్వలేని విపక్షాలు కుట్ర రాజకీయాలు చేస్తున్నాయని ఆరోపించారు. స్థానిక సంస్థల ఎన్నికల అనంతరం బీఆర్ఎస్ తుడిచిపెట్టుకుపోవడం ఖాయమని పేర్కొన్నారు. కార్యక్రమంలో కాలుష్య నియంత్రణ మండలి రాష్ట్ర సభ్యుడు బాలాజీ సింగ్, పీఏసీఎస్ చైర్మన్ గట్ల కేశవ రెడ్డి, నాయకులు చర్ల వెంకట్ రెడ్డి, చెన్నారెడ్డి, అశోక్ బాబు, నర్సింహులు, అజీజ్, ఆరీఫ్, రహీమ్, జక్కు అనంత రెడ్డి, కల్లు పెంటారెడ్డి, వెంకట్ రెడ్డి, దామోదర్‌రెడ్డి, గుద్దేటి శ్రీను, పెద్దయ్య, వెంకట్ రెడ్డి పాల్గొన్నారు.

అభివృద్ధి పథంలో వికారాబాద్ బల్దియా

- టీయూఎఫ్ఐడీసీ కింద రూ.60 కోట్లు మంజూరు
- మున్సిపల్ చైర్‌పర్సన్ మంజులారమేశ్
- 11అంశాలతో కూడిన అజెండా ఏకగ్రీవం


మాట్లాడుతున్న మున్సిపల్ చైర్‌పర్సన్ మంజులరమేశ్

వికారాబాద్, జనవరి 20 (ఆంధ్రజ్యోతి): 11 అంశాలతో కూడిన అజెండాను ఏకగ్రీవంగా కౌన్సిల్ సభ్యులు ఆమోదించినట్లు మున్సిపల్ చైర్‌పర్సన్ మంజులారమేశ్ తెలిపారు. సోమవారం వికారాబాద్ బల్దియా కార్యాలయంలో చివరి కౌన్సిల్ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆమె మాట్లాడుతూ స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్ ఆధ్వర్యంలో మున్సిపాలిటీ అభివృద్ధి పథంలో ముందుకెళ్తుందన్నారు. ఇందులో భాగంగానే ప్రస్తుతం స్పీకర్ సహకారంతో వికారాబాద్ మునిసిపల్ అభివృద్ధికి కొత్తగా రూ.60 కోట్ల టీయూఎఫ్ఐడీసీ నిధులు మంజూరయ్యాయని తెలిపారు. పట్టణ అభివృద్ధికి రూ. 10 కోట్ల ఎస్‌డీఎఫ్ నిధులు కూడా త్వరలోనే మంజూరు కానునానయని ఆమె తెలిపారు. సమావేశంలో వైస్ చైర్‌పర్సన్ శంషాద్ బేగం, కాంగ్రెస్ పార్టీ బల్దియా ఫ్లోర్‌లీడర్ సుధాకర్‌రెడ్డి, కౌన్సిలర్లు, కోఆప్షన్ సభ్యులు, కమిషనర్ జాకీర్ అహ్మద్ మునిసిపల్ అధికారులు తదితరులు పాల్గొన్నారు.

ఆలయ అభివృద్ధికి కృషి

శామీర్‌పేట, జనవరి 20 (ఆంధ్రజ్యోతి): శ్రీసీతారామచంద్రస్వామి ఆలయాన్ని అన్ని హంగులతో అభివృద్ధి చేసేందుకు కృషి చేస్తానని నూతన చైర్మన్ పెండం లక్ష్మీనారాయణ అన్నారు. తూంకుంట మున్సిపల్ పరిధిలోని దేవరయాంజాల్‌లో గల శ్రీసీతారామచంద్రస్వామి ఆలయంలో ప్రభుత్వ దేవాదాయ, ధర్మదాయ శాఖ ఆధ్వర్యంలో సోమవారం ఎన్నికైన నూతన ధర్మకర్తల ప్రమాణాస్వీకార కార్యక్రమాన్ని నిర్వహించారు. శ్రీసీతారామచంద్రస్వామి ఆలయ నూతన చైర్మన్‌గా దేవరయాంజాల్‌కు చెందిన పెండం లక్ష్మీనారాయణ(నాని), అదేవిధంగా నూతన ధర్మకర్తలుగా ఎల్లంకి భారతి, వలందాస్ మురళీగౌడ్, బీమిడి నీలంసంజీవరెడ్డి(కొండల్‌రెడ్డి), హరిగోపాల్, హరికృష్ణ, తూంకుంట జగదీశ్‌గౌడ్, ఎక్స్ అఫిషియో మెంబర్‌గా కందాల రామాచార్యులుల ను దేవాదాయశాఖ ఇన్‌స్పెక్టర్ మోహన్ ప్రమాణస్వీకారం చేయించారు.

తెలుగు పాటకు ఆస్కార్ 95ఏళ్లలో మొదటిసారి

ఆస్కార్ అవార్డు గ్రహీత కేఎస్ చంద్రబోస్



ఘట్‌కేసర్, జనవరి 20 (ఆంధ్రజ్యోతి): 95ఏళ్ల ఆస్కార్ చరిత్రలో సంపూర్ణ భారతీయ చిత్రానికి మొట్టమొదటి ఆస్కార్ అవార్డు నాటునాటు పాట దక్కించుకుందని సినీ గేయ రచయిత, ఆస్కార్ అవార్డు గ్రహీత కేఎస్ చంద్రబోస్ అన్నారు. పోచారం మున్సిపాలిటీ పరిధిలోని చౌదరిగూడ విజయపురి కాలనీలో గల విజయరత్న సీబీఎస్ఈ స్కూల్ వార్షికోత్సవ కార్యక్రమానికి ఆదివారం రాత్రి ఆయన ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఇప్పటి వరకు 870సినిమాల్లో 3వేల 700వందలకు పైగా పాటలు రాసినట్లు గుర్తుచేశారు. తాను మొదటిసారి 1995లో మొదటిపాట రాశానని తెలిపారు. ఒక్కటైనా జాతీయ పురస్కారం పొందాలని అనుకునేవాడినని, ప్రతీ సంవత్సరం పాటరాసి పంపేడినని గుర్తుచేసుకున్నారు. 2023లో తన కల నెరవేరిందని, నాలుగు అంతర్జాతీయ అవార్డులు వరించాయని తెలిపారు. అందులో ఎంతో విశిష్టమైనది ఆస్కార్ అవార్డు అని చెప్పారు. ఆస్కార్ అవార్డు బరువు ఐయిదు కేజీలే అయినప్పటికీ అది 140కోట్ల భారతీయుల గెలుపు బరువని అభివర్ణించారు. అనంతరం ఆయన రచించిన పలు పాటలను ఆలకించారు. విద్యార్థులు అన్నిరంగాల్లో రాణించేందుకు శ్రమించాలన్నారు. అనంతరం వివిధ పోటీల్లో గెలుపొందిన విద్యార్థులకు ఆయన బహుమతులు ప్రదానం చేశారు. ఈ కార్యక్రమంలో పాఠశాల డైరెక్టర్లు కె.విజయసేనారెడ్డి, ఎం.నరేంద్రనాథ్, ఎం.నర్సింహారావు, కె.శ్రీనివాస్‌రెడ్డి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

పాఠాలు చెప్పడం లేదంటూ కళాశాలకు తాళం వేసిన విద్యార్థులు


కళాశాల ఎదుట ఆందోళన చేస్తున్న విద్యార్థులు

తాండూరు, జనవరి 20 (ఆంధ్రజ్యోతి) : ఫీజులు దండుకుంటూ చదువులు చెప్పడం లేదంటూ సోమవారం వికారాబాద్ జిల్లా తాండూరులోని ఓ డిగ్రీ కళాశాల గేట్‌కు విద్యార్థులు తాళం వేసి ఆందోళన వ్యక్తం చేశారు. పట్టణంలోని శ్రీసాయి డిగ్రీకళాశాలలో డిగ్రీ మూడు సంవత్సరాలు కలిపి మొత్తం 300 మంది వరకు విద్యార్థులున్నారు. గతేడాది నవంబర్‌లో పరీక్షలు కూడా నిర్వహించారు. అప్పటి నుంచి అరకొరగా తరగతులు నిర్వహిస్తున్నారని, రెండు నెలలుగా ఎలాంటి తరగతులు నిర్వహించడం లేదని ఆగ్రహించిన విద్యార్థులు కళాశాలకు తాళం వేశారు. పలు మార్లు కరస్పాండెంట్, నిర్వాహకులకు విన్నవించినా పెడచెవిన పెట్టడంతో విద్యార్థులు ఆందోళన వ్యక్తం చేశారు. కళాశాలలో చదువులు చెప్పకుండా అధ్యాపకులు తమ భవిష్యత్ జీవితాలతో చెలగాటమాడుతున్నారని ఆరోపించారు. విద్యార్థులకు బీసీసంఘం పట్టణ అధ్యక్షులు సాయి తదితరులు మద్దతు తెలిపారు.

కలెక్టర్ ముందే కన్నీరు



మోమిన్‌పేట్, జనవరి 20 (ఆంధ్రజ్యోతి): తన భూమిని ఇతర వ్యక్తులకు రిజిస్ట్రేషన్ చేశారని కలెక్టర్ ముందే ఓ రైతు కన్నీరు పెట్టుకున్నాడు. వివరాల్లోకి వెళ్తే.. మండల కేంద్రంలో సర్వే నెం.661లో ఇజ్రాచిట్టెంపల్లి గ్రామానికి చెందిన సీత్యానాయక్‌కు ఎకరా 10గుంటల సాగు భూమి ఉంది. అయితే ఈనెల 16న తమకు తెలియకుండా కొందరు అట్టి భూమిని జీపీఏ ఇతర వ్యక్తులకు రిజిస్ట్రేషన్ చేసి ఇచ్చారని సీత్యానాయక్ కుమారుడు ధన్నునాయక్ వాపోయాడు. ఇందుకు స్పందించిన కలెక్టర్ పూర్తి విచారణ జరిపి బాధిత రైతులకు న్యాయం చేయాలని ట్రెయినీ కలెక్టర్, మోమిన్‌పేట్ తహసీల్దార్ మనోహర చక్రవర్తిలను ఆదేశించారు. సమగ్ర విచారణ జరిపి నివేదికను కలెక్టర్‌కు అందిస్తామని అధికారులు తెలిపారు.

దళిత వర్గీకరణ సాధనే లక్ష్యం

యాచారం, జనవరి 20 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వం దళిత వర్గీకరణ చేసేదాకా తమ పోరాటం ఆపేది లేదని ఎమ్మార్పీఎస్ జిల్లా నాయకులు రావుగళ్లబాబు అన్నారు. సోమవారం యాచారం మండల కేంద్రంలోని డీఎస్ఆర్ గార్డన్‌లో నియోజకవర్గ స్థాయి ఎమ్మార్పీఎస్ కార్యకర్తల సమావేశాన్ని మండల అధ్యక్షుడు శ్రీకాంత్ అధ్యక్షతన నిర్వహించారు. వచ్చే నెల 7న నగరంలో లక్ష డప్పులతో దండోరా మోగించి రాష్ట్ర ప్రభుత్వాన్ని హెచ్చరిస్తామన్నారు. సమావేశంలో ఇబ్రహీంపట్నం నియోజకవర్గం సోషలిస్ట్ పార్టీ ఇన్‌చార్జి కాళ్ల పాండు, నాయకులు శివకృష్ణ, బాలరాజు, బోడ రాజు, మూలి మహేష్ తదితరులున్నారు.

హామీల అమలులో కాంగ్రెస్ విఫలం


రుణమాఫీ చేయాలంటూ అంబేడ్కర్ విగ్రహానికి వినతిప్రత్రం ఇస్తున్న బీఆర్ఎస్ నాయకులు

షాబాద్, జనవరి 20(ఆంధ్రజ్యోతి): కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల్లో ఇచ్చిన హామీలను అమలు చేయడంలో ఘోరంగా విఫలమైందని మాజీ జడ్పీటీసీ జడల రాజేందర్‌గౌడ్, సర్దార్‌నగర్ ఏఎంసీ మాజీ చైర్మన్ నక్క శ్రీనివాస్‌గౌడ్, బీఆర్ఎస్ మండలాధ్యక్షుడు గూడూరు నర్సింగ్‌రావు ఆరోపించారు. సోమవారం షాబాద్ మండల కేంద్రంలో రైతులకు రుణమాఫీ చేయాలని, రైతుభరోసా అందించాలని అంబేద్కర్ విగ్రహానికి వినతిప్రతం అందజేసి నిరసన తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ... షాబాద్‌లో కేటీఆర్ రైతు ధర్నా జరిగిన ప్రదేశాన్ని కాంగ్రెస్ నాయకులు నీళ్లు, కల్లాపి చల్లి శుద్ధి చేయడం దుర్మార్గమైన చర్య అని మండిపడ్డారు. ఈ నెల 26 నుంచి రైతు భరోసా నిధులు వెంటనే విడుదల చేయాలన్నారు. కేసీఆర్ హయాంలో రైతు ఆనందంగా ఉన్నాడన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ సర్పంచ్‌లు కేతన రమేష్, శ్రీనివాస్‌గౌడ్, రాంచంద్రారెడ్డి, కృష్ణారెడ్డి, నర్సింహులు, చంద్రశేఖర్, దేవేందర్‌రెడ్డి, మాజీ ఎంపీటీసీ సత్యనారాయణ, నాయకులు రాంచందర్, శ్రీనివాస్‌రెడ్డి, మహిపాల్‌రెడ్డి, నారాయణరెడ్డి, భూపాల్ రెడ్డి, మల్లేష్, వెంకట్‌రెడ్డి, ముజ్రంఖాన్, రైతులు పాల్గొన్నారు.

జేపీ దర్గాలో భక్తులపై వ్యాపారుల దాడి

కొత్తూర్, జనవరి 20 (ఆంధ్రజ్యోతి): తమ దగ్గర పూజా సామగ్రి కొనుగోలు చేయలంటూ దర్గాకు వచ్చే వాహనాలను బలవంతంగా నిలిపి భక్తులపై వ్యాపారస్తులు దాడులకు పాల్పడుతున్నారు. స్థానిక ఎస్ఐ శ్రీనివాస్ కథనం ప్రకారం.. జేపీ దర్గా ఉర్సు రెండు రోజుల క్రితం ముగియగా భక్తుల రద్దీ కొనసాతుంది. సోమవారం దర్శనం కోసం హైదరాబాద్ నుంచి పలువురు భక్తులు బైక్‌లపై దర్గాకు వచ్చారు. ఇన్ముల్‌నర్వ రహదారిలో ఉన్న పూల దుకాణాలకు చెందిన పలువురు వారిని అడ్డగించి పూజాసామగ్రి కొనుగోలు చేయాలని బలవంతం చేశారు. భక్తులు అంగీకరించకపోవడంతో మాటామాట పెరగడంతో వ్యాపారస్తులు భక్తులపై కర్రలు, చేతులతో దాడి చేశారు. విషయం తెలుసుకున్న పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని పరిస్థితిని పరిశీలించారు. గాయపడ్డ వారిని ఆస్పత్రికి తరలించారు. దాడికి పాల్పడిన సద్దాం, బురాన్, ఫయాం, షేక్ అఫ్రోజ్‌లపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. దర్గా ఆవరణలో రంగులరాట్నం వద్దకు వచ్చిన కొందరు భక్తులతో సిబ్బంది గొడవ పడడంతో అక్కడ కూడా ఘర్షణ తలెత్తిందని పలువురు తెలిపారు. ఈ ఘటనపై దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

పాఠశాల హెచ్‌ఎంపై దాడి హేయం


మాట్లాడుతున్న వెంకటరత్నం

నవాబుపేట, జనవరి 20 (ఆంధ్రజ్యోతి): రంగారెడ్డి జిల్లా తుక్కుగూడ పాఠశాల ప్రధానోపాధ్యాయుడు రాములుపై దాడి హేయమని యూటీఎఫ్ జిల్లా అధ్యక్షుడు సీహెచ్ వెంకటరత్నం అన్నారు. నవాబుపేట, మీనపల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలల్లో సోమవారం మధ్యాహ్న భోజన సమయంలో నిరసన తెలిపారు. దాడికి పాల్పడిన వారిని అరెస్టు చేసేంత వరకు ఉద్యమాన్ని కొనసాగిస్తామన్నారు. ఈ కార్యక్రమంలో హెచ్‌ఎంలు బాలేశ్వర్‌రావు, ఉపాధ్యాయులు శ్రీనివాసరావు, గోవిందమ్మ, వెంకటయ్య, మాణిక్ ప్రభు, మల్లేశం, రవీందర్ తదితరులు పాల్గొన్నారు.

బొంరాస్‌పేట్: తుక్కుగూడ పాఠశాల ప్రధానోపాధ్యాయుడు రాములుపై దాడికి నిరసనగా సోమవారం బొంరాస్‌పేట్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ఆవరణలో ఉపాధ్యాయులు నల్ల బ్యాడ్జీలు ధరించి నిరసన తెలిపారు. ఈ కార్యక్రమంలో హెచ్‌ఎం రవీందర్‌గౌడ్, నాయకులు గౌరారం గోపాల్, శివరాజ్, మల్లేశ్, అనిల్‌కుమార్, వెంకటేశ్, మల్లయ్య పాల్గొన్నారు.

రోడ్డు విస్తరణ బాధితులకు నష్ట పరిహారం చెల్లించాలి


సమావేశంలో బీజేపీ నాయకులు

మేడ్చల్ టౌన్, జనవరి 20 (ఆంధ్రజ్యోతి): మేడ్చల్‌లో చేపడుతున్న జాతీయ రహదారి విస్తరణలో స్థలాలు కోల్పోయిన బాధితులకు రాష్ట్ర ప్రభుత్వం నష్ట పరిహారం చెల్లించాలని బీజేపీ రాష్ట్ర నాయకుడు నారెడ్డి నందారెడ్డి డిమాండ్ చేశారు. బీజేపీ నాయకులు సోమవారం మేడ్చల్‌లో ప్రత్యేకంగా సమావేశం నిర్వహించగా ముఖ్య అతిథులుగా హాజరైన రాష్ట్ర నాయకుడు నారెడ్డి నందారెడ్డి మాట్లాడారు. గుండ్లపోచంపల్లి మున్సిపాలిటీ కండ్లకోయ నుంచి మండలంలోని ఎల్లంపేట గ్రామం వరకు గల 44వ నంబర్ జాతీయ రహదారి విస్తరణలో స్థలాలు కోల్పోయిన బాధితులకు ప్రభుత్వం తగిన పరిహారం చెల్లించలేదని ఆరోపించారు. ఈవిషయమై కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి, ఎంపీ ఈటల రాజేందర్‌కు స్థానిక బీజేపీ శాఖ తరపున ప్రత్యేకంగా వినతిపత్రాలు అందజేశామని తెలిపారు. ఈ కార్యక్రమంలో రూరల్ జిల్లా ఉపాధ్యక్షుడు గౌరారం జగన్ గౌడ్, మేడ్చల్ పట్టణ అధ్యక్షురాలు శైలజ, ప్రధాన కార్యదర్శి జాకట ప్రేమ్ దాస్, నాయకులు వంశీధర్ రెడ్డి పాల్గొన్నారు.

నేటి నుంచి గ్రామ సభలు

గ్రామ, వార్డు సభల్లో లబ్ధిదారుల ఎంపిక వివరాలు వెల్లడించిన అధికారులు


కేశంపేట: అధికారుల సమీక్ష సమావేశంలో తహసీల్దార్ అజాంఅలీ

కేశంపేట, జనవరి 20(ఆంధ్రజ్యోతి) లబ్ధిదారుల ఎంపికకు నిర్వహించే గ్రామ, వార్డు సభలను పక్కగా నిర్వహించాలని కేశంపేట తహసీల్దార్ మీర్ అజాంఅలీ సూచించారు. సోమవారం మండల పరిషత్ కార్యాలయంలో మండల స్థాయి అధికారులు, గ్రామ పంచాయతీ ప్రత్యేకాధికారులతో సమావేశమయ్యారు. సోమవారం నుంచి బుధవారం వరకు అన్ని గ్రామాలలో ఇందిరమ్మ ఇళ్లు, ఇందిరమ్మ ఆత్మీయ భరోసా, రేషన్ కార్డులు, రైతు భరోసాలపై గ్రామ సభలు నిర్వహిస్తున్నామని పేర్కొన్నారు. 21న అల్వాల, చౌలపల్లి, దత్తాయపల్లి, ఎక్లాస్‌ఖాన్‌పేట, కాకునూర్, కేశంపేట, కొత్తపేట, నిర్దవెల్లి, పాపిరెడ్డిగూడ, 22న లింగంధన, చింతకుంటపల్లి, ఇప్పలపల్లి, కొనాయపల్లి, కొండారెడ్డిపల్లి, మంగలిగూడ, పొల్కొనిగుట్ట తండా, పుట్టవానిగూడ, సంతాపూర్, తొమ్మిదిరేకుల, తూర్పుగడ్డ తండా, 23న దేవునిగుడితండా, బైర్కాన్‌పల్లి, లేమామిడి, పాటిగడ్డ, పోమాల్‌పల్లి, సంగెం, సుందరాపూర్, వేముల్‌నర్వ గ్రామాల్లో గ్రామ సభలు ఉంటాయని వివరించారు.

యాచారం: గ్రామసభల వివరాలను ఎంపీడీవో నరేందర్‌రెడ్డి సోమవారం ప్రకటనలో తెలిపారు. 21న నందివనపర్తి, నజ్దిక్‌సింగారం, మంతన్‌గౌరెల్లి, అయ్యవారిగూడ, మల్కీజ్ గూడ, కేస్లీతండా, 22న గడ్డమల్లాయాగూడ, చిన్నతూండ్ల, చౌదర్‌పల్లి, గున్‌గల్, దర్మన్నగూడ, యాచారం, 23న తక్కళ్లపల్లితండా, మాల్, తక్కళ్లపల్లి, తమ్మలోనిగూడ, నల్లవెల్లి, కొత్తపల్లి, 24న కుర్మిద్ద, మేడిపల్లి, చింతపట్ల, తాటిపర్తి, నానక్‌నగర్, మొండిగౌరెల్లి గ్రామాల్లో గ్రామసభలు ఉంటాయని చెప్పారు.

మహేశ్వరం: గ్రామ సభల వివరాలను మండల అభివృద్ధి అధికారి శైలజారెడ్డి తెలిపారు. ఈ నెల 21 నుంచి 23 వరకు గ్రామ సభలు ఉంటాయన్నారు. కార్యక్రమంలో ఎంపీవో రవీందర్‌రెడ్డి, కార్యదర్శులు ఉన్నారు.

ఆదిభట్ల: వార్డు సభల వివరాలను ఆదిభట్ల మున్సిపల్ కమిషనర్ బాలకృష్ణ తెలిపారు. ఉదయం 10 గంటలకు 1, 9, 10 వార్డులకు ఆదిభట్ల మున్సిపాలిటీ కార్యాలయంలో, 5, 6, 7, 8, 14 వార్డులకు కొంగరకలాన్ లైబ్రరీలో సభ ఉంటాయన్నారు. 22న బొంగ్లూర్ కార్యాలయంలో 2, 11 వార్డులకు, ఎంపీ పటేల్‌గూడ కార్యాలయంలో 13, 15 వార్డులకు, మంగల్‌పల్లి వార్డు కార్యాలయంలో 4, 12 వార్డులకు, రాందాస్‌పల్లి వార్డు కార్యాలయంలో మూడో వార్డుకు సంబంధించి లబ్ధిదారుల పేర్లను చదివి వినిపిస్తామన్నారు.

ఇబ్రహీంపట్నం/ఆదిభట్ల: గ్రామ సభల వివరాలను ఆర్డీవో అనంతరెడ్డి తెలిపారు. డివిజన్‌లోని 109 గ్రామ పంచాయతీల్లో ప్రత్యేక అధికారుల అధ్యక్షతన గ్రామ సభలు ఉంటాయన్నారు. ప్రజల నుంచి వచ్చే సలహాలు, సూచనలు, అభ్యంతరములు స్వీకరిస్తామన్నారు.

శంకర్‌పల్లి: వార్డు సభల వివరాలను శంకర్‌పల్లి మున్సిపల్ కమిషనర్ శ్రీనివాస్ తెలిపారు. నేటి నుంచి 23వ తేదీ వార్డు సభలు నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. కార్యక్రమంలో మేనేజర్ అంజన్‌కుమార్ పాల్గొన్నారు.

కొత్తూర్: రైతు భరోసా, ఇందిరమ్మ ఆత్మీయ భరోసా, ఇందిరమ్మ ఇళ్లు, రేషన్‌కార్డుల లబ్ధిదారుల ఎంపిక కోసం ఈనెల 21 నుంచి 23వరకు మున్సిపాలిటీతోపాటు గ్రామాల్లో గ్రామసభలు నిర్వహిస్తున్నట్లు ఎంపీడీవో అరుంధతి, మున్సిపల్ కమిషనర్ బాలాజీ వేర్వేరు ప్రకటనల్లో పేర్కొన్నారు. నిర్ణీత తేదీల్లో గ్రామ సభలకు ప్రజలు హాజరు కావాలని కోరారు.

మంచాల: గ్రామ సభల వివరాలను ఎంపీడీవో బాలశంకర్ వివరించారు. 21న మంగళవారం లింగంపల్లి, 22న ఆరుట్ల, బోడకొండ, చిత్తాపూర్, దాద్‌పల్లి, కాగజ్‌ఘట్, కొర్రవానితండా, రంగాపూర్, 23న ఆగాపల్లి, అంబోత్‌తండా, చీదేడ్, చెన్నారెడ్డిగూడ, మంచాల, పటేల్‌చెర్వుతండా, సత్యంతండా, తాళ్లపల్లిగూడ, ఎల్లమ్మతండా, 24న అస్మత్‌పూర్, బండలేమూర్, జాపాల, లోయపల్లి, నోముల, తిప్పాయిగూడ గ్రామాల్లో గ్రామసభలు ఉంటాయని వివరించారు.

యాచారం: గ్రామసభల్లో ప్రజల అభిప్రాయాలను తెలుసుకోవాలని ఎంపీడీవో నరేందర్‌రెడ్డి అన్నారు. ప్రభుత్వ పథకాలపై సర్వే పక్కగా చేయాలని ఆదేశించారు. సమావేశంలో తహసీల్దార్ అయ్యప్ప, ఎంపీవో శ్రీలత, వ్యవసాయాధికారి సందీప్‌కుమార్, ఆర్‌డబ్ల్యూఎస్ ఈఈడీ రాజు, ఏఈఈ సుభాష్ ఉన్నారు.

ఆమనగల్లు: వార్డు సభల్లో అర్హుల జాబితాలను ప్రదర్శించాలని కమిషనర్ వసంత సూచించారు. రైతు భరోసా పథకంలో భాగంగా సాగుకు యోగ్యం కాని భూముల జాబితాలనూ ప్రదర్శిస్తామని తెలిపారు. 21న చంద్రాయన్‌పల్లి తండా, జంగారెడ్డిపల్లి, 6, 7, 11, 14 వార్డు, 22న 2, 5, 8, 9, 12, 15 వార్డుల పరిధిలో 23న 3, 10, 13 వార్డుల్లో సభలు ఉంటాయని వివరించారు.

కందుకూరు: ఇందిరమ్మ ఆత్మీయ భరోసా పథకానికి సంబంధించి 35 పంచాయతీల వివరాలను డీఆర్‌డీఓ శ్రీలత సోమవారం ఎంపీడీవో కార్యలయంలో పరిశీలించారు. జిల్లా వ్యాప్తంగా 14,284 మంది లబ్ధిదారులను గుర్తించినట్లు తెలిపారు. కార్యక్రమంలో ఎంపీడీవో సరిత, తదితరులు పాల్గొన్నారు.

సమర్థవంతంగా నిర్వహించాలి

చేవెళ్ల జనవరి 20 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపడుతున్న ప్రజాపాలన గ్రామ సభలను విజయవంతం చేయాలని చేవెళ్ల ఆర్డీవో చంద్రకళ కోరారు. సోమవారం చేవెళ్ల మండల పరిష్యత్ కార్యాలయంలో అన్ని శాఖల అధికారులతో సమీక్ష నిర్వహించారు. 21, 22 తేదీల్లో అన్ని గ్రామాల్లో గ్రామ సభలు ఉంటాయని, కొన్ని గ్రామాల్లో ఉదయం 10 గంటలకు, మరికొన్ని గ్రామాల్లో మధ్యాహ్నం 2గంటలకు ప్రారంభం అవుతాయని చెప్పారు. సమావేశంలో చేవెళ్ల తహసీల్దార్ కృష్ణయ్య, ఎంపీడీవో హిమబిందు, ఏవో శంకర్‌లాల్, గ్రామ కార్యదర్శులు, సిబ్బంది ఉన్నారు.


మాట్లాడుతున్న చేవెళ్ల ఆర్డీవో చంద్రకళ


సూచిక బోర్డులు ఏర్పాటు చేస్తున్న ఎండోమెంట్ ఈఓ మురళీకృష్ణ

దేవాదాయ భూములు ఆక్రమిస్తే చర్యలు

ఇబ్రహీంపట్నం/ఆదిభట్ల జనవరి 20 (ఆంధ్రజ్యోతి): ఆలయ భూములు ఆక్రమిస్తే చట్టరీత్యా చర్యలు తప్పవని ఎండోమెంట్ ఈఓ మురళీకృష్ణ హెచ్చరించారు. సోమవారం ఇబ్రహీంపట్నం చెరుకుకట్ట కింద ఉన్న వీరభద్ర ఆలయానికి చెందిన రెండెకరాల 22 గుంటల భూమిని పరిశీలించి సూచిక బోర్డులు ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మండలంలో 16 ఆలయాలకు భూములున్నాయని, కబ్జాకు గురికాకుండా సర్వే చేయించి ఫెన్సింగ్ వేయిస్తామన్నారు. వ్యవసాయానికి అనుకులంగా ఉన్న భూమిని వేలంపాట ద్వారా కౌలుకిస్తామన్నారు. కార్యక్రమంలో రాష్ట్ర వీరశైవ లింగాయత్ లింగబలిజ సంఘం సభ్యులు శెట్టి శివకుమార్, జిల్లా గౌరవ అధ్యక్షుడు ఆనందప్ప, పూజారి పవన్, మార్కెట్ కమిటీ సభ్యులు నెల్లి కుమారప్ప, బీజేపీ నాయకులు మహేందర్, అనిల్ పాల్గొన్నారు.

బాధిత కుటుంబాలకు ఆర్థికసాయం

కడ్తాల్, జనవరి 20 (ఆంధ్రజ్యోతి): డీసీసీ అధికార ప్రతినిధి, గూడూరు శ్రీనివాస్ రెడ్డి సోమవారం మండల కేంద్రంలో పర్యటించారు. స్థానిక రెండు, మూడు వార్డుల్లో ఇటీవల మృతి చెందిన సిద్దిగారి శివ, రాయకంటి పుల్లమ్మ కుటుంబాలను పరామర్శించారు. బాధిత కుటుంబాలకు వ్యక్తిగతంగా ఒక్కొక్కరికి రూ. 5వేల చొప్పున ఆర్థిక సాయం అందజేశారు. కొంతకాలంగా అనారోగ్యంతో చికిత్స పొందుతున్న కాలె జంగమ్మను పరామర్శించి రూ.5 వేలు చికిత్స కోసం సాయమందించారు. నాయకులు గురిగళ్ల లక్ష్మయ్య, జహంగీర్‌బాబా, మంకి శ్రీను, మల్లయ్య, క్యామ రాజేశ్, మంకి మహేశ్, రాజేంద్‌గౌడ్, శ్రీకాంత్, రమేశ్, మహేశ్, రాఘవేందర్, కేశవులు తదితరులు ఉన్నారు.

ఒక్కరి నేత్ర దానంతో ఇద్దరికి చూపు

ఆమనగల్లు, జనవరి 20 (ఆంధ్రజ్యోతి): ఒక్కరి నేత్ర దానంతో ఇద్దరికి దృష్టి భాగ్యం కలుగుతుందని ఆమనగల్లు ప్రభుత్వ ఆసుపత్రి మెడికల్ ఆఫీసర్ డాక్టర్ పరీక్షిత్‌నరేంద్ర అన్నారు. ఆమనగల్లు పట్టణంలోని ప్రభుత్వ ఆసుపత్రిలో సోమవారం జిల్లా అంధత్వ నివారణ సంస్థ సహకారంతో ఆమనగల్లు లయన్స్‌క్లబ్, ఎనుగొండ రాంరెడ్డి లయన్స్ కంటి ఆసుపత్రి సంయుక్త ఆధ్వర్యంలో ఉచిత కంటి వైద్య శిబిరం నిర్వహించారు. 65 మందికి కంటి పరీక్షలు నిర్వహించారు.

ఆపదలో ఉన్న వారికి అండగా ఉంటాం

తలకొండపల్లి, జనవరి 20 (ఆంధ్రజ్యోతి): ఆపదలో ఉన్న వారికి అండగా ఉంటామని ఆమనగల్లు మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ శ్రీనివాస్ రెడ్డి, మాజీ జడ్పీటీసీ ఉప్పల వెంకటేశ్ అన్నారు. చుక్కాపూర్ గ్రామానికి చెందిన రఘు, పెంటయ్య, జంగారెడి ఇటీవల మృతి చెందారు. బాధిత కుటుంబాలను సోమవారం శ్రీనివాస్ రెడ్డి, వెంకటేశ్ పరామర్శించారు. ఒక్కో కుటుంబానికి రూ. 6 వేల చొప్పున సమకూర్చగా బీఆర్ఎస్ గ్రామ అధ్యక్షుడు లక్ష్మోని మల్లేశ్ అందజేశారు.

సమస్యల పరిష్కారానికే 'ప్రజావాణి'

చేవెళ్ల జనవరి 20 (ఆంధ్రజ్యోతి): ప్రజా సమస్యల పరిష్కరం కోసమే ప్రజావాణి నిర్వహిస్తున్నామని చేవెళ్ల ఆర్డీవో చంద్రకళ తెలిపారు. సోమవారం ఆర్డీవో కార్యాలయంలో నిర్వహించిన ప్రజావాణిలో ప్రజల నుంచి వచ్చిన ఆరు ఫిర్యాదులు స్వీకరించినట్లు తెలిపారు. షాబాద్ మండలంలో మూడు భూ ఫిర్యాదులు, మొయినాబాద్ నుంచి ఒక భూ ఫిర్యాదు వచ్చిందన్నారు. రైతుబంధు ఇవ్వాలని మరో అర్జీ వచ్చినట్లు చెప్పారు. కార్యక్రమంలో ఏవో రాజశేఖర్, సిబ్బంది ఉన్నారు.

గట్టిప్పలపల్లిని మండలం చేయాలి


రిలే నిరహార దీక్షల్లో గ్రామస్తులు

తలకొండపల్లి, జనవరి 20 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రం ఏర్పాటుకు మహిళలు కదం తొక్కారు. తలకొండపల్లి మండలం గట్టిప్పలపల్లి గ్రామంలో సోమవారం పెద్దఎత్తున నిరసన చేపట్టారు. గ్రామంలో ర్యాలీ నిర్వహించారు. జేఏసీ నాయకులు, యువకులు, వివిధ ప్రజా సంఘాల నేతలు, మహిళలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. మండల కేంద్రం ఏర్పాటుకు చేపట్టిన రిలే నిరాహార దీక్షలు 81వ రోజుకు చేరాయి. మండల కేంద్రం ఏర్పాటు చేసేవరకు పోరాడుతామని జేఏసీ చైర్మన్ మొకురాల అశోక్‌గౌడ్, వైస్ చైర్మన్‌లు శరత్‌చంద్ర, ఆంజనేయులు గౌడ్, కార్యదర్శి ఏదుల అనిల్ పేర్కొన్నారు. ప్రభుత్వం నూతనంగా ప్రతిపాదించిన 11 మండలాల జాబితాలో గట్టిప్పలపల్లిని చేర్చాలని డిమాండ్ చేశారు. స్థానిక ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణ రెడ్డి, ఎంపీ మల్లు రవి మండల ఏర్పాటు విషయంలో చొరవ తీసుకోవాలని కోరారు. దీక్షలో కూర్చున్న వారిలో గీత, లక్ష్మి, పద్మమ్మ, లక్ష్మమ్మ, పోచమ్మ, బాలకృష్ణ, వసంత, విజయ, సుజాత, రాములమ్మ, జంగమ్మ, మైసమ్మ, అలివేలు, వెంకటమ్మ, చంద్రమ్మ, చిట్టెమ్మ, వెంకటయ్య, నర్సింహ, మల్లయ్య, నిరంజన్, భాస్కర్, బాలయ్య, తదితరులు పాల్గొన్నారు.

రోడ్డు నిర్మాణానికి శంకుస్థాపన

శంషాబాద్, జనవరి 20 (ఆంధ్రజ్యోతి): గడిచిన ఐదేళ్లలో సంవత్సరాల్లో మున్సిపాలిటీలో పలు అభివృద్ధి పనులు చేపట్టామని, కొన్నిపనులు పూర్తికాగా మరికొన్ని కొనసాగుతున్నాయని రాజేంద్రనగర్ ఎమ్మెల్యే ప్రకాష్‌గౌడ్ అన్నారు. సోమవారం శంషాబాద్‌లో హెచ్ఎండీఏ నిధులతో నిర్మించనున్న రోడ్డు పనులకు మున్సిపల్ చైర్‌పర్సన్ సుష్మామహేందర్‌రెడ్డితో కలసి శంకుస్థాపన చేశారు. కార్యక్రమంలో వైస్ చైర్మన్ బండి గోపాల్‌యాదవ్, కౌన్సిలర్లు కొండ ప్రవీణ్‌గౌడ్, అయిల్ కుమార్, అజయ్, సంజయ్‌యాదవ్, రేఖాగణేష్‌గుప్తా, భారతమ్మ, మేకల వెంకటేష్, భద్రూనాయక్, కమిషనర్ సుమన్‌రావు, ఏఈ నరేష్, స్థానికులు దూడల వెంకటేష్, మహేందర్‌రెడ్డి, ప్రభాకర్ పాల్గొన్నారు.

హైదరాబాద్ సభకు లక్షలాదిగా తరలిరావాలి

మంచాల, జనవరి 20(ఆంధ్రజ్యోతి): ఎస్సీ వర్గీకరణతోనే ఉపకులాలకు న్యాయం జరుగుతుందని మాదిగ జేఏసీ ఇబ్రహీంపట్నం నియోజకవర్గ గౌరవ అధ్యక్షుడు బోసుపల్లి ప్రతాప్ అన్నారు. మంచాలలోని షర్వంజీ గార్డెన్స్‌లో సోమవారం విలేకరులతో మాట్లాడారు. సుప్రీం కోర్టు తీర్పు మేరకు తెలంగాణలో ఎస్సీ వర్గీకరణ అమలు చేయాలని డిమాండ్ చేస్తూ ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షుడు మందకృష్ణ మాదిగ నేతృత్వంలో ఈ సభను తలపెట్టినట్లు తెలిపారు. మాదిగ జేఏసీ నియోజకవర్గ అధ్యక్షుడు కంబాలపల్లి భాస్కర్, యాదయ్య, మల్లేష్, కృష్ణ, పాండు, శ్రీను, యాదగిరి, యాదయ్య తదితరులున్నారు.

ఆముదం సాగుపై అవగాహన



శంషాబాద్ రూరల్, జనవరి 20 (ఆంధ్రజ్యోతి): శంషాబాద్ మండలం నర్కూడ గ్రామంలో సోమవారం ఆముదం సాగుపై రాజేంద్రనగర్ పరిశోధన స్థానం శాస్త్రవేత్తలు రైతులకు అవగాహన సదస్సు నిర్వహించారు. మహబూబ్‌నగర్, రంగారెడ్డి, నల్గొండ జిల్లాల్లో ఈ పంటను విస్తారంగా పండించే వారు అని తెలిపారు. పదేళ్లలో ఈ పంట విస్తీర్ణం గణనీయంగా తగ్గిందన్నారు.

అర్హులను తేల్చేందుకు!

(5వ పేజీ తరువాయి)

చేర్పులకు అవకాశం కల్పిస్తున్నారు. ప్రజాపాలన సేవా కేంద్రాల ద్వారా కూడ కొత్త రేషన్ కార్డులకు లేదా కొత్త సభ్యుల చేర్పులకు దరఖాస్తులు స్వీకరించే విధంగా ఏర్పాట్లు చేస్తున్నారు. ఇందిరమ్మ ఇళ్లకు సంబంధించి ఇంటి స్థలం ఉన్నవారి జాబితా, ఇంటి స్థలం లేని వారి రెండు జాబితాలను గ్రామ సభలో ప్రదర్శించనున్నారు. కొత్తగా గ్రామ సభలో స్వీకరించే దరఖాస్తులను పరిశీలించనున్నారు. ఈనెల 21 నుంచి 24వ తేది వరకు ఆయా గ్రామ సభల్లో, మున్సిపల్ వార్డులో సభలు నిర్వహించి జాబితాను ఉంచనున్నారు. గతంలో నిర్వహించిన ప్రజాపాలన గ్రామ సభల మాదిరిగానే గ్రామ సభలను నిర్వహించేందుకు ఏర్పాట్లు పూర్తి చేశారు. గ్రామ సభలకు హాజరయ్యే ప్రజలకు కనీస మౌలిక సదుపాయలను కల్పించేలా చర్యలు తీసుకుంటున్నారు. ప్రభుత్వ అత్యంత ప్రతిష్టాత్మకంగా నిర్వహించే ఈ కార్యక్రమాన్ని సమర్థవంతంగా నిర్వహించేలా అధికారులు ముందుకు సాగుతున్నారు. సమస్యాత్మక ప్రాంతాల్లో ముందస్తు జాగ్రత్తులు తీసుకుంటున్నారు. ఘనతంత్ర్య దినోత్సవం సందర్భంగా ఈనెల 26 నుంచి పై నాలుగు పథకాలను అమలు చేయనున్నారు.

గ్రామ సభలకు విస్తృత ఏర్పాట్లు : కలెక్టర్ నారాయణరెడ్డి

గ్రామ సభలకు విస్తృత ఏర్పాట్లు చేయాలని కలెక్టర్ సి. నారాయణరెడ్డి ఆదేశించారు. రేషన్ కార్డులు, రైతు భరోసా, ఇందిరమ్మ ఇండ్లు, ఇందిరమ్మ ఆత్మీయ భరోసా పథకాల ఫీల్డ్ వెరిఫికేషన్, గ్రామ సభల నిర్వహణపై సోమవారం అధికారులతో టెలికాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా సర్వే పురోగతిపై అధికారులను అడిగి తెలుసుకున్నారు. ఈనెల 21 నుంచి 24వ తేది వరకు నిర్వహించే గ్రామ సభలను పకడ్బందీగా నిర్వహించాలన్నారు. అర్హులైన ప్రతి ఒక్కరికీ రేషన్‌కార్డు జారీ చేయడం జరుగుతుందన్నారు. రేషన్ కార్డుల జారీ, ఇందిరమ్మ ఇండ్ల పథకం నిరంతర ప్రక్రియ అని తెలిపారు. కార్డు రాలేదని ఎవరూ ఆందోళన చెందాల్సిన అవసరం లేదన్నారు. ప్రజాపాలన సేవా కేంద్రాల ద్వారా కొత్త రేషన్ కార్డులకు, కొత్తసభ్యుల చేర్పులకు దరఖాస్తులు స్వీకరించడం జరుగుతుందని తెలిపారు. ఇంకా మిగిలిన ఫీల్డ్ వెరిఫికేషన్ పూర్తి చేయాలని తెలిపారు. గ్రామ సభలో దరఖాస్తులను స్వీకరించే సమయంలో కుటుంబ యజమాని పేరు, ఆధార్, మొబైల్ నెంబర్, అడ్రస్ తీసుకోవాలని చెప్పారు. ఎవరిదైనా పేరు మిస్సైతే ప్రజాపాలన మీ సేవ కేంద్రాల్లో దరఖాస్తు చేసుకోవచ్చన్నారు. రేషన్ కార్డులకు సంబంధించి ప్రతీది రిజిస్టర్‌లో నమోదు చేయాలని సూచించారు. వ్యవసాయ యోగ్యమైన భూమికి రైతు భరోసా కల్పించడం జరుగుతుందన్నారు. వ్యవసాయ అధికారులు, రెవెన్యూ అధికారులు సంయుక్తంగా రైతు భరోసా లబ్ధిదారులను గుర్తించాలన్నారు. ఉపాధిహామీ పథకంలో కనీసం 20 రోజులు పాటు కూలి పనికి వెళ్లిన వారికే ఇందిరమ్మ ఆత్మీయ భరోసా వర్తింప చేయడం జరుగుతుందన్నారు. ప్రతీ కుటుంబంలో మహిళ బ్యాంకు ఖాతాలకే ఇందిరమ్మ ఆత్మీయ భరోసా మొత్తాన్ని బదిలీ చేయడం జరుగుతుందని తెలిపారు.

పాఠశాలకు పూర్వ విద్యార్థుల చేయూత

యాచారం, జనవరి 20 (ఆంధ్రజ్యోతి): విద్యాబుద్ధులు నేర్పిన పాఠశాలకు సోమవారం 1990-91 పదోతరగతి బ్యాచ్ విద్యార్థులు రూ.26వేల నగదు అందించారు. పాఠశాలలో సోమవారం పూర్వ విద్యార్థులు సమావేశమై సమస్యలపై చర్చించి నగదును ప్రధానోపాధ్యాయురాలు ఉదయశ్రీకి అందించారు. కార్యక్రమంలో పూర్వ విద్యార్థులు తలారి మల్లేష్, దెంది మధుకర్‌రెడ్డి, మెట్టె శ్రీను, బన్నె శ్రీశైలం, కె.యాదయ్య, శ్రీనివాస్‌చారి, ఎండీ ఖాజ డాక్టర్ రవీందర్‌గుప్త ఉన్నారు.

ఆలయాభివృద్ధికి విరాళం అందజేత

చేవెళ్ల, జనవరి 20 (ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని తంగడ్‌పల్లి గ్రామంలో నూతనంగా నిర్మిస్తున్న హనుమాన్ ఆలయ నిర్మాణానికి సోమవారం చేవెళ్ల పీఏసీఎస్ చైర్మన్ దేవర వెంకటరెడ్డి, చేవెళ్ల మాజీ సర్పంచ్ బండారు శైలజాఆగిరెడ్డి ఇరువురు కలిసి రూ.లక్ష విరాళం అందించారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్ భీమయ్య, తంగడ్‌పల్లి సీనియర్ నాయకులు రాములుగౌడ్, సత్యంగౌడ్, దామోదర్‌రెడ్డి, మల్లారెడ్డి, శ్రీనివాస్ ఉన్నారు.

రాజ్యాధికారంతోనే బీసీల అభివృద్ధి


చంద్రశేఖర్, మాణయ్యను సన్మానిస్తున్న నేతలు

షాబాద్, జనవరి 20(ఆంధ్రజ్యోతి): బీసీలకు రాజ్యాధికారం వచ్చినప్పుడే అసలైన అభివృద్ధి సాధ్యమని బీసీ ఐక్యవేదిక నాయకులు బర్క కృష్ణ, రాపోల్ నర్సింహులు అన్నారు. సోమవారం షాబాద్ ముదిరాజ్ భవన్‌లో గుడిమల్కాపూర్ మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ కావలి చంద్రశేఖర్, బీజేపీ షాబాద్ మండల అధ్యక్షుడిగా ఎన్నికైన మద్దూరి మాణయ్యను ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. బీసీలు అన్ని రంగాల్లో రాణించాలన్నారు. బీసీ నేతలు తమ్మలి రవీందర్, చేవెళ్ల స్వామి, కూర వెంకటయ్య, లింగం, మాసయ్య, నర్సింహులు, పాండు, శ్రీనివాస్‌గౌడ్, మహేందర్, ఆనందం, సత్తయ్య, చెన్నయ్య, గౌరీశ్వర్, వెంకటేష్, పోచయ్య పాల్గొన్నారు.

బీసీలు సంఘటితం కావాలి

బీసీలు సంఘటితమై రాజకీయంగా ఎదగాలని బీసీసేన జాతీయ అధ్యక్షుడు బర్క కృష్ణ అన్నారు. మండల పరిధిలోని మన్‌మర్రి గ్రామంలో ఆదివారం రాత్రి బీసీసేన గ్రామ కమిటీని వేశారు. అధ్యక్షుడిగా శ్రీకాంత్, ఉపాధ్యక్షులుగా కృష్ణ, ప్రధానకార్యదర్శి రాజు, కార్యవర్గ సభ్యులను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... వచ్చే స్థానిక సంస్థల ఎన్నికల్లో 23 శాతం ఉన్న బీసీ రిజర్వేషన్లను 42 శాతానికి పెంచాలన్నారు.


మాట్లాడుతున్న నాయకులు

చేవెళ్ల మున్సిపాలిటీలో ఊరెళ్లను కలపొద్దు

చేవెళ్ల, జనవరి 20 (ఆంధ్రజ్యోతి): చేవెళ్ల మున్సిపాలిటీలో ఊరెళ్ల గ్రామాన్ని విలీనం చేయొద్దని గ్రామస్తులు ఉబ్బటి బీరప్ప, క్యాసాని కరుణాకర్, పవన్ కోరారు. చేవెళ్లలో సోమవారం వాకె మాట్లాడుతూ.. చేవెళ్ల పట్టణ కేంద్రానికి ఐదు కిలోమీటర్ల దూరంలో ఉన్న ఊరెళ్ల గ్రామాన్ని చేవెళ్ల మున్సిపాలిటీలో కలుపొద్దని కోరారు. చేవెళ్లకు ఆనుకొని ఉన్న కందవాడ, పలుగుట్ట, మల్లారెడ్డిగూడ, పామెన గ్రామాలను మున్సిపాలిటీలో కలుపకపోవడం ఏంటని ప్రశ్నించారు. రాజకీయ ఒత్తిడిలకు గురై ఊరెళ్ల గ్రామాన్ని చేవెళ్ల మున్సిపాలిటీలో విలీనం చేయడం తగదన్నారు. ఊరెళ్లలో వ్యవసాయం, కూలీలుగా జీవనం సాగిస్తున్నారని, 300 మందికిపైగా ఉపాధి హామీ పనులు చేసుకుంటున్నారని పేర్కొన్నారు. గ్రామస్తులు పవన్, భాస్కర్, శ్రావన్, శ్రీకాంత్, రంజిత్, సుధాకర్ ఉన్నారు.

సాగుకు యోగ్యం కానివి 599.28 ఎకరాలు

ఆమనగల్లు , జనవరి 20 (ఆంధ్రజ్యోతి): రైతు భరోసా పథకం అమలులో భాగంగా ఆమనగల్లు మండలంలో సాగుకు యోగ్యం కాని భూముల వివరాల సేకరణ పూర్తి చేసినట్లు తహసీల్దార్ లలిత, మండల వ్యవసాయ అధికారి శ్రీనివాస్ గౌడ్ తెలిపారు. ప్రభుత్వ ఆదేశాలను అనుసరించి రెవెన్యూ, వ్యవసాయ శాఖల సంయుక్త ఆధ్వర్యంలో గ్రామాల వారీగా సర్వే చేసి వివరాలు సేకరించినట్లు పేర్కొన్నారు. ఆమనగల్లు తహసీల్దార్ కార్యాలయంలో సోమవారం లలిత, శ్రీనివాస్ గౌడ్ మాట్లాడుతూ ఆమనగల్లు మున్సిపాలిటీతోపాటు మండలంలోని ఎనిమిది గ్రామ పంచాయతీల పరిధిలోని 599.28 ఎకరాలు సాగుకు యోగ్యం కాని భూములను గుర్తించినట్లు తెలిపారు. రానుంతలలో 13.15 ఎకరాలు, విఠాయిపల్లిలో 24.17 ఎకరాలు, కోనాపూర్‌లో 2.33, ఆమనగల్లులో 449.16, చెన్నంపల్లిలో 23.10 , శెట్టిపల్లిలో 3.07, సింగంపల్లిలో 2.01, ఆకుతోటపల్లిలో 29.14, పోలెపల్లిలో 51.30 ఎకరాలు సాగుకు యోగ్యం కాని భూములు గుర్తించినట్లు వివరించారు. ఆయా భూముల వివరాలను 21 నుంచి 23వ తేదీ వరకు జరిగే గ్రామ సభల్లో ప్రదర్శిస్తామని తెలిపారు.

సమావేశాన్ని విజయవంతం చేయాలి

చేవెళ్ల, జనవరి 20 (ఆంధ్రజ్యోతి): ఈనెల 29వ తేదిన చేవెళ్ల పట్టణ కేంద్రంలో సీపీఐ పార్టీ సర్వసభ్య సమావేశంను విజయవంతం చేయాలని సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యుడు రామస్వామి పిలుపునిచ్చారు. సోమవారం చేవెళ్ల పట్టణ కేంద్రంలోని సీపీఐ కాలనీ ఫేస్2లో పార్టీ నాయకులతో ముందస్తు సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ. సీపీఐ సర్వసభ్య సమావేశం మండల కేంద్రంలోని కేజీఆర్ గార్డెన్‌లో ఉంటుందన్నారు. ఈ కార్యక్రమానికి సీపీఐ రాష్ట్ర కార్యదర్శి కొత్తగూడెం ఎమ్మెల్యే సాంబశివరావు హాజరవుతారిని తెలిపారు. సమావేశంలో మండల ప్రధాన కార్యదర్శి సత్తిరెడ్డి, నాయకులు సత్యనారాయణ, సుభాన్‌రెడ్డి, కృష్ణగౌడ్, పోచయ్య, యాదగిరి, మగ్బుల్, అంజిరెడ్డి, పెంటయ్య, సుగుణమ్మ, రమాదేవి, వినోద, శ్రీశైలం, నర్సింహులు ఉన్నారు.


వేద విద్యార్థులకు వైద్య పరీక్షలు

షాద్‌నగర్‌రూరల్, జనవరి20(ఆంధ్రజ్యోతి): ఫరూఖ్‌నగర్ మండలం కిషన్‌నగర్ శివారులో ఉన్న శ్రీ జగద్గురువు పంచమాచార్య వీర శైవ ఆగమ పాఠశాలలో వేద పండితం చదువుతున్న విద్యార్థులకు సోమవారం వైద్య పరీక్షలు నిర్వహించారు. షాద్‌నగర్ డిప్యూటీ డీఎంహెచ్‌వో డాక్టర్ విజయలక్ష్మి ఆధ్వర్యంలో వైద్య పరీక్షలు చేశారు. అక్కడ చదువుతున్న 95 మంది విద్యార్థులకు పరీక్షలు నిర్వహించి అవసరమైన మందులు అందించారు. కార్యక్రమంలో వైద్యులు జగదీశ్వర్, ముస్తాక్ అహ్మద్, హెల్త్ ఎడ్యుకేటర్ శ్రీనివాసులు, సిబ్బంది పాల్గొన్నారు.

డిగ్రీ కాలేజీలో ఏఐ కోర్స్ ప్రారంభం

ఇబ్రహీంపట్నం జనవరి20 (ఆంధ్రజ్యోతి): సాంకేతిక విద్యలో ఏఐ(ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్) భవిష్యత్‌లో అధిక ప్రాధన్యతను సంతరించుకుంటుందని ఇబ్రహీంపట్నం ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ రాధిక పేర్కొన్నారు. కళాశాలలో సోమవారం ఏఐ కోర్స్‌ను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ విద్యార్థినులు ఈ కోర్స్‌పై అవగాహన కలిగి ఉండాలన్నారు. ఈ కోర్స్ ప్రధానంగా డేటా విశ్లేషణ, ఆటోమేషన్, అభ్యాస సామర్థ్యం, పైథాన్ వంటి కోర్స్‌లపై పూర్తి అవగాహన కలిగేలా చేస్తుందన్నారు. కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ సురేష్, టీఎస్‌కేసీ కో-ఆర్డినేటర్ రాజు, అధ్యాపకులు పవన్, రవికుమార్, టీఎస్‌కేసీ మెంటర్ ప్రసాద్, ట్రైనర్ సంజీవ్ తదితరులు పాల్గొన్నారు.

ప్రతి ఒక్కరూ దైవ కార్యక్రమాల్లో పాల్గొనాలి


పోస్టర్ ను ఆవిష్కరిస్తున్న ఏఐసీసీ కార్యదర్శి చల్లా వంశీచంద్ రెడ్డి

ఆమనగల్లు, జనవరి 20 (ఆంధ్రజ్యోతి): దైవ కార్యక్రమాల్లో ప్రతిఒక్కరూ పాలు పంచుకోవాలని ఏఐసీసీ కార్యదర్శి, సీడబ్ల్యూసీ సభ్యుడు చల్లా వంశీచంద్ రెడ్డి కోరారు. పురాతన ఆలయాల పునరుద్దరణ, దైవ కార్యక్రమాలకు, పర్యాటక ప్రాంతాల అభివృద్ధికి కృషి చేస్తున్నా మన్నారు. తలకొండపల్లి మండలం వెల్జాల శ్రీ వేద్రాద్రి లక్ష్మీనర్సింహ స్వామి దేవాలయ నిర్వాహకులు సోమవారం వంశీచంద్ రెడ్డిని హైదరాబాద్‌లోని ఆయన నివాసంలో మర్యాదపూర్వకంగా కలిశారు. పూలమాలలు, శాలువాలతో సత్కరించారు. ఫిబ్రవరి 7నుంచి 9వ తేదీ వరకు ఆలయంలో నిర్వహించే బ్రహ్మోత్సవాల పోస్టర్లు, బ్రోచర్లను ఆవిష్కరించారు. కార్యక్రమంలో ఆలయ ధర్మకర్త శ్రీనివాసమూర్తి, మార్కెట్ డైరెక్టర్ చర్ల వెంకట్ రెడ్డి, నాయకులు అశోక్ బాబు, నర్సింహులు, ఆరీఫ్, అజీజ్ ఉన్నారు.

బ్యాంకు రుణాలు సద్వినియోగం చేసుకోవాలి

చౌదరిగూడ,జనవరి 20(ఆంధ్రజ్యోతి): మహిళా సంఘాల సభ్యులు బ్యాంకు రుణాలను సద్వినియోగం చేసుకోవాలని కొందుర్గు యూనియన్ బ్యాంకు మేనేజర్ వెంకటేశ్ అన్నారు. సోమవారం జిల్లేడ్ చౌదరిగూడ మండల పరిధిలోని పద్మారంలో పీఎంఎఫ్ఎంఈ స్కీం రూ.2 లక్షలతో మంజూరైన పిండి గిర్ని, కారం మిషన్లను ప్రారంభించారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్ లక్ష్మీసుధ, మాజీ ఎంపీటీసీ రాములు, మండల మహిళ సమాఖ్య అధ్యక్షురాలు మంజుల, ఏపీఎం నరసింహ, సీసీలు దేవయ్య, రమేష్, వీవోఏలు సిబ్బంది పాల్గొన్నారు.

స్థానిక పోరుకు సన్నద్ధం!

(5వ పేజీ తరువాయి)

ఎన్నికలు వాయిదా వేసి గ్రామాల్లో ప్రత్యేకాధికారుల పాలన తీసుకువచ్చారు. కానీ, అప్పటి నుంచి స్థానిక ఎన్నికల నిర్వహణ ఏదో కారణంతో వాయిదా పడుతూ వస్తున్నాయి. పంచాయతీ ఎన్నికల నోటిఫికేషన్ ఈ నెలాఖరులో రావొచ్చనే ప్రచారం సాగుతోంది. ఫిబ్రవరి రెండవ వారం, లేదా మార్చిలో సర్పంచ్ ఎన్నికలు, మే నెలలో ఎంపీటీసీ, జెడ్పీటీసీ ఎన్నికలు జరిగే అవకాశం ఉందని అధికారులు చెబుతున్నారు. ఈ మేరకు గతంలో వార్డు సభ్యులు, సర్పంచ్ పదవులకు ఉన్న రిజర్వేషన్ల వివరాలను అధికారులు సేకరిస్తున్నారు. కులగణన ఆధారంగా సర్పంచ్, ఎంపీటీసీ, జెడ్పీటీసీ పదవులకు రిజర్వేషన్లను ప్రకటించే అవకాశముందని నాయకులు, అధికారులు అనుమానిస్తున్నారు.

ఆశావహుల ఎదురు చూపు

పంచాయతీ ఎన్నికలలో పోటీ చేయడానికి ఆశావహులు సిద్ధమవుతున్నారు. సర్పంచ్ పదవికి పోటీ చేయాలనుకుంటున్న నాయకులు గ్రామాలలో ఓటర్లను మచ్చిక చేసుకునే పనిలో నిమగ్నమయ్యారు. యువతకు క్రికెట్, వాలీబాల్ కిట్లను పంపిణీ చేస్తున్నారు. గ్రామంలో ఎవరైనా మృతిచెందితే ఆ కుటుంబానికి రూ. 5 వేల నుంచి రూ.10వేల ఆర్థిక సాయం అందిస్తున్నారు. ఆటల పోటీలు, పలు సేవా కార్యక్రమాలు నిర్వహిస్తూ ప్రజల మన్ననలు పొందేందుకు తెగ ఆరాట పడిపోతున్నారు. జనానికి ఏ సాయం కావాలన్నా ముందుకు వస్తున్నారు. ఒకవేళ సర్పంచ్ పదవి అనుకూలంగా రిజర్వేషన్ రాకపోతే ఎంపీటీసీ పదవికి అయినా పోటీ చేయాలని నాయకులు రెడీ అవుతున్నారు. గతంలో సర్పంచులుగా పోటీ చేసి ఓడినవారు ఈ సారి ఎలాగైనా గెలిపించాలని వేడుకుంటున్నారు. తాజా మాజీ సర్పంచులు సైతం మళ్లీ బరిలో దిగడానికి పావులు కదుపుతున్నారు. సంతానం విషయంలో నిబంధనలు ఎత్తేయడంతో గ్రామాల్లో ఆశావహుల సంఖ్య పెరిగే అవకాశముంది. ఎన్నికలలో ఎంత ఖర్చు చేసైనా గెలుపొందాలని చూస్తున్నారు.